

లక్ష్మీ ప్రసీద.. ప్రసీద !

● ఆఖరి శ్రావణ శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి, మూలస్థానేశ్వర, రంగనాథ స్వామి ఆలయాల్లో సామూహిక పూజలు చేశారు.

నూతన విధానంలో 'ఈ-క్రాప్'



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నూతన విధానంలో ఈ-క్రాప్ నమోదు జరుగుతోంది. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. రైతులు ఉన్నా లేకున్నా ఈ-క్రాప్ నమోదు చేస్తారు. గతంలో జరిగిన లోపాలను సరిచేసుకుంటూ సాగుతున్న ఈ పద్ధతిని డిజిటల్ ఈ-క్రాప్ అని కూడా పిలుస్తున్నారు. సాగు చేస్తున్న, సాగు చేయని భూములన్నింటినీ నమోదు చేయడమే ఈసారి ప్రత్యేకత.

- వివరాలు 8లో...

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నాయకులు

● ఉపాధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి, సంయుక్త కోశాధికారిగా సత్యనారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు చోటు లభించింది. ఆ పార్టీ సీనియర్ నేతలు పెట్టేటి సురేంద్రరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కందుకూరి సత్యనారాయణ రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి దశ నుంచే సురేంద్రరెడ్డి రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మూడు సార్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర సెల్స్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. మరోసారి ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి వరించింది. అలాగే మరో సీనియర్ నేత కందకూరి సత్యనారాయణ 1994లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర జాయింట్ కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

పట్టుకో.. పట్టుకో

శ్రీకాంత్, అరుణ గ్యాంగ్‌ల కోసం పోలీసుల వేట

సిద్ధం చేసుకున్న జాబితా ఆధారంగా జల్లెడ

వరుస అరెస్టులకు రంగం సిద్ధం

విషయం తెలిసి పొరుగు రాష్ట్రాలకు జంప్!

అయినా, ముమ్మరంగా గాలింపు

కి'లేడి' నిడిగుంట అరుణ, రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ అనుచరులు ఎక్కడెక్కడ ఉన్నారు!? ఎంత మంది ఉన్నారు!? ఆ గ్యాంగ్ చేసిన అరాచకాలెంటి? వారి ఆగడాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయా!? బాధితులు ఉన్నారా!? ఇలా పోలీస్ యంత్రాంగం శోధిస్తోంది.


నెల్లూరు (క్రైం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో బెదిరింపులు, దాడులు, హత్యలు, బ్లాక్‌మెయిల్, దందాలు ఇలా అనేక నేరాలకు శ్రీకాంత్, అరుణలు పాల్పడ్డారు. అంతటితో ఆగక పోలీసు ఉన్నతాధికారులను వలలో వేసుకొని ఎవరినీ లెక్క చేయకుండా పేట్రేగిపోయారు. తాము చెప్పిన, సూచించిన వాటన్నిటికీ తలూపితే సరే లేకుంటే ప్రాణాలు తీసేంత స్థాయికి ఎదిగిపోయారు. అధికారులనూ లోబరుచుకుని తాము అనుకున్నదంతా చేశారు. అయితే, వీరిద్దరి ఆగడాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బ్రేక్ పడింది. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ రద్దు కావడం నుంచి నేర సామ్రాజ్యానికి బీటలు పడటం ఆరంభమైంది. ఆ తర్వాత అనూహ్యంగా అరుణ అరెస్టుతో వారితోపాటు నడిచిన గ్యాంగ్‌ల గుండెల్లో దడ మొదలైంది.


● **వివరాలు సేకరణ**

రాష్ట్రవ్యాప్తంగా శ్రీకాంత్, అరుణల వ్యవహారం సంచలనంగా మారడంతో పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలో వారికి అండగా ఉన్న రౌడీగ్యాంగ్‌ల వివరాలను సేకరించడం ప్రారంభించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలతోపాటు శ్రీకాంత్, అరుణలతో చేతులు కలిపి నేరాలకు పాల్పడిన వారి జాబితాను సిద్ధం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ముందుగా గుర్తించిన రౌడీషీటర్లను ఎక్కడ కనిపిస్తే అక్కడ అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరులోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ముగ్గురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. శనివారం వారిని అరెస్ట్ చూపించే అవకాశం ఉంది. ఇలా పోలీసుల దూకుడు పెంచడంతో పలువురు రౌడీషీటర్లు జిల్లాను వీడి చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, గోవా వంటి ప్రాంతాలకు పరారైనట్లు సమాచారం. అలా వెళ్లిన వారి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

● **రూ.21 లక్షలు మోసం చేశారు!**

మరోవైపు అరుణ తనను మోసం చేసిందంటూ శుక్రవారం విజయవాడ నుంచి ఓ వ్యక్తి నెల్లూరుకు వచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆ వ్యక్తి ఫిర్యాదు ఇస్తుండగా తిరిగి నెల్లూరుకు పిలిపించారు. అసలేం జరిగిందో సమగ్రంగా విచారిస్తున్నారు. అరుణ తన వద్ద రూ.21 లక్షలు తీసుకొని మోసగించినట్లు విజయవాడవాసి వాపోయినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు ఆధారంగా అరుణపై మరో కేసు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది.





పెన్నమ్మ ఒడికి కృష్ణమ్మ

● సోమశిల జలాశయానికి జలకళ

● 55 టీఎంసీలు దాటిన నీటిమట్టం

అనంతసాగరం ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు నీటి నిల్వ క్రమేణా పెరుగుతుండటంతో డ్యాం జలకళను సంతరించుకుంటోంది. ఈ ఏడాది జూలై 9 నుంచి కృష్ణా జలాల రాక మొదలవగా, అప్పటికే సోమశిలలో కేవలం 29 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఆ తర్వాత ప్రభుత్వం తీసుకొన్న చొరవతో పాతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు నీటి మోతాదును పెంచడం, పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు వరద పోటెత్తింది. ప్రస్తుతం 25,124 క్యూసెక్కుల నీరు వస్తుండగా జలాశయం నీటిమట్టం 55.038 టీఎంసీలకు చేరుకొంది. సుమారు 26 టీఎంసీల నీరు అదనంగా చేకూరాయి. ఇక కండలేరు జలాశయానికి రోజువారీగా 9,400 క్యూసెక్కులు వదులుతుండగా అక్కడకు 8,600 క్యూసెక్కులు చేరుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కృష్ణమ్మ కరుణతో కండలేరులోనూ నీటిమట్టం (ప్రస్తుతం 28.59 టీఎంసీలు ఉన్నాయి.) పెరుగుతుండగా తాగు, సాగునీటి ఇబ్బందులు తీరాయి. రానున్న ఖరీఫ్, రబీతోపాటు తాగునీటి అవసరాలు తీర్చేవిధంగా యంత్రాగం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇక రాబోవు రెండు మాసాల్లో భారీవర్షాలు కురిసే సూచనలు ఉండగా ఈలోపే సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తిసామర్థ్యానికి చేరుకొనే అవకాశాలు ఉన్నాయి.

డ్యూటీచార్ట్‌లపై కోర్టుకెక్కిన కార్మికులు

● ఆర్టీసీ డీఎం, ఏడీఎంలకు నోటీసులు

కందుకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు ఆర్టీసీ డిపోలో డ్యూటీచార్ట్‌ల వ్యవహారంపై పలువురు కార్మికులు కోర్టు మెట్లు ఎక్కారు. వారు పటిషన్ దాఖలు చేయడంతో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని డీఎం, ఏడీఎంలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. డ్యూటీ చార్ట్‌లు వేయటంలో అధికారులు నిబంధనలు పాటించటం లేదని, దీంతో కొందరు కార్మికులపై పనిభారం పెరుగుతోం దంటూ కందుకూరు డిపోలో డ్రైవర్లుగా పని చేస్తున్న కూనం వెంకటరామిరెడ్డి, కొండా శ్రీనివాసరావు, దాసరి రమణయ్య, కొమ్మాలపాటి సుబ్బారావులు ఈ ఏడాది ఏప్రిల్ 4న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కార్మికుల అభిప్రాయాలు తీసుకోకుండా వేసిన డ్యూటీచార్ట్‌లను నిలుపుదల చేయాలని సూచిస్తూ ఏప్రిల్ 7న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఆ ఉత్తర్వులను డిపో అధికారులు బేఖాతరు చేయటంతో డిపో మేనేజరు రాపూరి శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు మురళీబాబులు వ్యక్తిగతంగా కోర్టులో హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని డ్రైవర్ల తరపు న్యాయవాది సీహెచ్ నాగేంద్రశర్మ తెలిపారు.



రిలయన్స్ భూముల్లో ప్రైవేటు సెజ్

రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం

రూ.1800 కోట్లతో పారిశ్రామికవాడ అభివృద్ధి ● 20 వేల మందికి ఉపాధి అవకాశం

నెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముత్తుకూరు మండలంలో ఉన్న కృష్ణపట్నం సెజ్‌లో రిలయన్స్‌కు కేటాయించిన 2600 ఎకరాల్లో ప్రైవేటు పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిసింది. రిలయన్స్ సంస్థ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పదం మేరకు ఇక్కడ భారీ పారిశ్రామికవాడ ఏర్పాటు కానుంది. చాలా ఏళ్ల క్రితం కృష్ణపట్నం పోర్టు సమీపంలో పరిశ్రమల అభివద్ధి కోసం రిలయన్స్ సంస్థకు 2600 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఆ సంస్థ భూములు స్వాధీనం చేసుకుందేగానీ పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టలేదు. ఈ భూములను పరిశ్రమల స్థాపన నిమిత్తం ఇతరులకు విక్రయించాలని నిర్ణయించుకుంది. ఈ దశలో ఆ భూములను వెనక్కు తీసుకోవాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, పరిశ్రమల స్థాపనకు సానుకూల పరిస్థితులు ఏర్పడటంతో రిలయన్స్ సంస్థ ఈ భూమిలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చింది. ఈ ఏడాది జనవరి నెలలో ఆ సంస్థ అధినేత అనిల్ అంబానీ ఈ భూములను సందర్శించారు. ఆ తరువాత ఇక్కడ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజాగా ఆ ప్రతిపాదనను విరమించుకొని ప్రైవేటు పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని రిలయన్స్ సంస్థ నిర్ణయించుకుంది.

● **రూ.1800 కోట్లతో..**

ఈ భూముల్లో ప్రైవేటు సెజ్ ఏర్పాటుకు రిలయన్స్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరిందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. ఆ ఒప్పందం ప్రకారం ఇది శ్రీసిటీ తరహాలో పూర్తిగా ప్రైవేటు పారిశ్రామిక వాడ అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇక్కడికి పరిశ్రమలను ఆకర్షించడానికి రూ.1800 కోట్లతో పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ఎకరాకు రూ.3లక్షలను ప్రోత్సాహకంగా మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు చేస్తారు. పరిశ్రమలకు భూముల కేటాయింపు, వాటి ధరలపై రిలయన్స్ సంస్థకు పూర్తి అధికారాలు ఉంటాయి.

● **20వేల మందికి ఉపాధి**

ఈ ప్రైవేటు పారిశ్రామికవాడ ద్వారా రాబోయే పదేళ్లలో 20వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని రిలయన్స్ సంస్థ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉన్న ఈ సెజ్ త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని, తక్కువ కాలంలోనే 20వేలకన్నా ఎక్కువ మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక వర్గాల అంచనా.



ఈ ఏడాది జనవరిలో రిలయన్స్ భూములను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఆ సంస్థ అధినేత అనిల్ అంబానీ

యూరియా అక్రమాల నిరోధానికి ప్రత్యేక స్క్వాడ్లు: డీఏవో

నెల్లూరు(వ్యవసాయం): జిల్లాలో యూరియా అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక అంతర్గత స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పీ సత్యవాణి ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్లు, గోదాములు, స్టాక్ పాయింట్లలో యూరియా సరఫరా, నిల్వలు, వినియోగం పై స్క్వాడ్లు సమగ్రంగా పరిశీలన జరుపుతాయని తెలిపారు. పరిశ్రమలకు అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడం, క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయి తనిఖీలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులకు ఎరువులను సకాలంలో అందించడమే ఈచర్యల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ఆహార పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై యూరియా ఇస్తుందని, జామాయిల్, సుబాబుల్ వంటి పంటలకు కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలని ఆమె సూచించారు.

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ

● దగదర్తిలో విమానాశ్రయం నిర్మాణానికి అడుగులు

● ఆమోదం తెలిపిన రాష్ట్ర క్యాబినెట్

● 1379 ఎకరాలకు 814 ఎకరాల సేకరణ పూర్తి

● ఈ ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభమే తరువాయి



దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019లో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన పైలాన్

కావలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విమానాశ్రయం ఏర్పాటుపై జిల్లావాసుల కల నెరవేరబోతోంది. దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన ముసాయిదా ఆర్ఎఫ్‌పీని మంత్రివర్గం ఆమోదించింది. హడ్కో రుణంతో భూసేకరణ, యుటిలిటీల బదిలీ ప్రక్రియ పూర్తి చేయటం, ప్రతిపాదిత విమానాశ్రయం కోసం మౌలిక సదుపాయాల కల్పన ప్రతిపాదనలకు మౌలికవసతులు, పెట్టుబడుల శాఖ ప్రతిపాదించగా మంత్రిమండలి ఆమోదించింది. ఇక మిగిలిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేస్తే పనులు ప్రారంభించడమే తరువాయి. వివిధ సమీకరణాల అనంతరం చివరకు విమానాశ్రయ నిర్మాణానికి 1,379 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో 814 ఎకరాల సేకరణ పూర్తి చేసి విమానయాన అభివృద్ధి సంస్థకు అప్పగించారు. దీంతో 2019లో విమానాశ్రయ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. అయితే ఆ ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావటంతో దామవరం విమానాశ్రయాన్ని రద్దు చేసింది. దీంతో జిల్లా ప్రజల ఆశలు సన్నగిల్లాయి.

● **కూటమి ప్రభుత్వంలో మరలా ఆశలు**

2024లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ రావు టీడీపీకి చెందిన నేత కావడమేగాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కావటంతో దామవరం విమానాశ్రయంపై జిల్లావాసుల్లో ఆశలు చిగురించాయి. గతంలో తానే శంకుస్థాపన చేసి ఉండటంతో చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విమానాశ్రయాన్ని మరలా దామవరానికి మంజూరు చేయించారు. ఓ కేంద్ర బృందం కూడా దామవరానికి చేరుకుని అధ్యయనం చేసింది. త్వరగా భూసేకరణ పూర్తి చేసి తమకు అప్పగిస్తే వేగంగా పనులు పూర్తి చేస్తామని ఆ బృందం స్పష్టం చేసింది. అయితే, ఎందుకనో ప్రక్రియ ఆలస్యం అవుతూ వచ్చింది. తాజాగా రాష్ట్ర మంత్రి మండలి దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఆమోదం తెలపడంతో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తి చేసి త్వరలో విమానాశ్రయ నిర్మాణపనులు ప్రారంభమవుతాయనే నమ్మకం జిల్లావాసుల్లో నెలకొంది.



రిబ్బన్ కట్ చేసి పర్యాటక శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆ శాఖ ఆర్డీ రమణప్రసాద్, పక్కన కలెక్టర్ ఆనంద్, తదితరులు

పర్యాటక అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఆధునీకరించిన పర్యాటక శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యాలయం చాలా బాగుందని కితాబిచ్చారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో అన్నీ వసతులు కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, మ్యూజియంలు, బీచ్‌ల విశేషాలపై విస్తృత ప్రచారం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, తహసీల్దారు కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలోని మైపాడు బీచ్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఆ బీచ్ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు.

అనూహ్యంగా పెరిగిన పొగాకు ధర

● కిలో రూ.297 పలికిన రేటు ● నాణ్యమైన పొగాకు కోసం వ్యాపారుల పోటీ



కందుకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అధికారిక పొగాకు వేలం ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మార్కెట్లో డిమాండ్ నెలకొంది. నాణ్యమైన పొగాకు కోసం వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేస్తుండటంతో ధరపై విధించిన సీలింగ్ బ్రేక్ అయింది. వారం క్రితం వరకూ అత్యధిక ధరపై కిలోకు రూ.280 వద్ద సీలింగ్ పెట్టుకుని కొనుగోళ్లు చేసిన వ్యాపారులు సోమవారం నుంచి ఆ సీలింగ్‌ను బ్రేక్ చేశారు. తొలుత సీలింగ్ దాటి ఒక్క రూపాయి అదనంగా ధర పెట్టిన వ్యాపారులు రోజూ కొంత పెంచుకుంటూ శుక్రవారం రూ.297 ధర పెట్టి కొనుగోలు చేశారు. కందుకూరు-2 వేలం కేంద్రంలో ఈ ధర పలకగా, కందుకూరు-1 కేంద్రంలోనూ రూ.295 నమోదైంది. కోల్డ్‌స్టోరేజీలలో నిల్వచేసిన నాణ్యమైన పొగాకును ఇప్పుడిప్పుడే రైతులు బయటకు తీసి వేలం కేంద్రాలకు తెస్తుండగా ఆ పొగాకు కోసం వ్యాపారులు పోటీ పడుతుండటమే ఇందుకు కారణమని, రానున్న రోజుల్లో ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉందని బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైన పొగాకుకు మార్కెట్లో రూ.320వరకు ధర పలికే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే లో గ్రేడ్, మీడియం గ్రేడ్‌లకు ధరలు పెరగకపోవటం, ఈ రకాలనే రైతులు ఎక్కువగా వేలం కేంద్రాలకు తెస్తుండటంతో శుక్రవారం కూడా నోబిడ్‌లు, సీఆర్‌లు అధికంగానే ఉన్నాయి. కందుకూరు-2లో శుక్రవారం 736 బేళ్లను వేలంకు తెప్పించగా 325 బేళ్లు మాత్రమే అమ్ముడుపోయాయి.

'మెట్ట'కు జ్వరమొచ్చింది!

● ఓ పక్క వర్షాలు.. మరోపక్క లోపించిన పారిశుధ్యం

● వైరల్ ఫీవర్‌తో ప్రజల అవస్థలు

● ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రద్దీ

■ 8లో...



గిరిజనకాలనీని పరిశీలించిన అధికారులు

మనుబోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆదేశాలతో శుక్రవారం మండలంలోని పిడూరు గ్రామంలో మిక్స్‌డ్ కాలనీలో ఉన్న గిరిజనుల ఇళ్లకు అధికారులు పరుగులు తీశారు. ఈ నెల 14న ఎమ్మెల్యే మనుబోలుకు రాగా, పిడూరు గిరిజనులు తమ కాలనీలో మురుగు కాలువలు లేవని గోడు వెళ్ళబోసుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే అధికారులను ఆదేశించగా గిరిజనుల ఇళ్లను ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా, గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్, ఆర్ఐ అరుణ్‌బాబు పరిశీలించారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9498
వెండి కిలో ధర	రూ. 117300
వెండి ఒక గ్రాము	రూ. 120.30

కసుమూరు హుండీ లెక్కింపు

● రెండు రోజులకు రూ. 46 లక్షలు

వెంకటాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గా హుండీ లెక్కింపు మూడవరోజైన శుక్రవారం కూడా కొనసాగింది. తొలి రెండు రోజులకు దాదాపు రూ.46 లక్షల రుపాయలు వచ్చినట్లు దర్గా ఈవో షేక్ షరీఫ్ తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని వక్ఫ్‌బోర్డు అధికారులు వెల్లడించారు. గత మూడు రోజుల నుంచి జరుగుతున్న హుండీ లెక్కింపు ప్రక్రియ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖల సమక్షంలో గ్రామస్తులు, దర్గా ముజావర్ల పర్యవేక్షణలో జరుగుతుండగా వక్ఫ్‌బోర్డు అధికారి మొహ్మద్ హుస్సేన్, జిల్లా ఇన్స్‌పెక్టర్ ఖుదావన్, దర్గా ఈవో షేక్ షరీఫ్, దర్గా కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ దగ్గరుండి పర్యవేక్షించారు.

వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వాలి

మనుబోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 26వ తేదీ నుంచి 31లోగా 65 ఏళ్ళ వయసు కలిగిన కార్డుదారులకు ఇళ్ళకు వెళ్లి సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రమాదేవి రేషన్ డీలర్లకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె రేషన్‌డీలర్లతో సమీక్ష నిర్వహించారు. 1వ తేదీనుంచి 15 వరకు డీలర్లు దుకాణం వద్ద అందుబాటులో ఉండి సరుకులు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపతహసీల్దార్ ప్రదీప్, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ రవి పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ నిత్యాన్నదాన సదనానికి శాశ్వత విరాళంగా రూ.25 వేలు, నిత్య కళ్యాణోత్సవానికి శాశ్వత విరళంగా రూ. 25 వేలు మొత్తం 50వేలు విరాళాన్ని దాత నెల్లూరుకు చెందిన ఎస్.లక్ష్మి, ఆలయ అధికారులకు శుక్రవారం అందజేశారు.

● జొన్నవాడ ఆలయంలో శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి సోమిరెడ్డి జ్యోతి కామాక్షితాయికి రూ.50వేలు విలువ చేసే పట్టు చీరను బహూకరించారు. ఆలయ అర్చకులు గోత్ర నామములతో స్వామి అమ్మవారికి ప్ర త్యేక పూజలు నిర్వహించారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

పొదలకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చిరంజీవి జన్మదినం శుక్రవారం చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. స్థానిక జమున సినిమాస్ సెంటర్‌లో కేక్ కట్ చేసి టపాసులు పేల్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సినీ రంగంలోనూ, సేవా రంగంలోనూ చిరంజీవి సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మెగా అభిమాన సంఘం నాయకులు చింతగింజల విజయ్, కలగట్ల సందీప్ అన్నారు. ఈ కార్యక్రమంలో మధు, అశోక్, ప్రసాద్, మనోజ్, రాజా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం పూజలు

విడవలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం గ్రామంలో వెలసివున్న శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవా రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ ఈవో బొగ్గల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయ పూజారులు శ్రీకాంత్‌శర్మ, శ్రీనివాసులుశర్మలు అమ్మవారికి కుంకు మార్చనలు, వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించా రు. ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్య క్రమంలో ఆలయ గుమస్తా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆదిలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు, సాయంత్రం ప్రాకారోత్సవం నిర్వహించగా, సామూహిక కుంకుమార్చనలో భక్తులు పాల్గొన్నారని ఆల య ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

సామూహిక లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) ఆఖరు శ్రావణ శుక్ర వారం సందర్భంగా మండలంలోని జొన్న వాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షి తాయి ఆలయం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనంతో ఆలయం కిటకిట లాడింది. ఈ సందర్భంగా ఉదయం ఆల యంలో మల్లికార్జున స్వామి వారికి పంచా మృత అభిషేకము, అమ్మవారికి నవావరణ పూజలు, ఖడ్గమాల, సహస్రనామార్చన, సా మూహిక లక్ష కుంకుమార్చన పూజలను ఆలయ పురోహితులు, పండితులు, అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆలయంలో ప్రసిద్ధ కళాకారులు ఆర్ పద్మ చక్రవర్తి, పి.హేమలక్ష్మి, ఎస్.నాగలక్ష్మి చేసిన వీణా వాయిద్యం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులు రెడ్డి పర్య వేక్షించారు.

విడవలూరు-వావిళ్ల రోడ్డుకు మహర్దశ

రూ. 90 లక్షల నిధుల మంజూరు

జోరందుకున్న రోడ్డు నిర్మాణ పనులు

విడవలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోని విడవలూరు-వావిళ్ల రహదారికి మహర్దశ కలిగింది. విడవలూరు నుంచి వావిళ్లకు రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అధిక సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. అయితే ఈ రహదారి గుంతలమయం కావడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేయాలని ప్రజలు అనేకసార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఒక్క గుంతను కూడా పూడ్చలేదు. పెద్ద పెద్ద గుంతలతో ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది.

● ఎమ్మెల్యే చొరవతో నిధుల మంజూరు

ప్రజల రహదారి కష్టాలను తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఫలితంగా సుమారు రూ. 90 లక్షల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. దీంతో రోడ్డు మరమ్మతు పనులను అధికారులు ప్రారంభించారు. దారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి రోడ్డుపైన ఉన్న గ్రావెల్ తీశారు. రోడ్డు పనులు జరుగుతుండటంతో విడవలూరు, వావిళ్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విడవలూరు- వావిళ్ల రహదారిపై వేసిన గ్రావెల్

నాణ్యతలో రాజీ పడకుండా పనులు

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తూ.చా. తప్పకుండా పాటిస్తున్నాం. అవకతవకలు జరగకుండా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. నెల రోజుల్లో పనులు పూర్తవుతాయి.

- ఖాదర్ బాషా, ప్రాజెక్టు ఏఈ



ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం

విడవలూరు, వావిళ్ల రహ దారి మరమ్మతులు చేయాలని గతంలో అనేకసార్లు ప్రజా ప్రతిని ధుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ పట్టిం చుకోలేదు. సుమారు పదేళ్లుగా ఎదురు చూస్తు న్నాం. ఎమ్మెల్యే సహకారంతో నేడు రహదారి పనులు జరుగుతున్నాయి.

- ఏటూరు హరిరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు, విడవలూరు

'ఆకుపచ్చ'ని రహదారిలో... హాయిగా!



రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

ముత్తుకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చెట్లు.. వానలకు పిలుపులే కాదు.. రహదారులకు ఆకుపచ్చటి తోరణాలు కూడా. అందుకు ఈ చిత్రమే సాక్ష్యం. నెల్లూరు ప్రధాన రహదారి నుంచి పిడతాపుల్లూరుకు వెళ్లే మార్గంలో నిత్యం ఈ ఆహ్లాదకర దృశ్యం కనిపిస్తుంది. మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన పెద్ద పెద్ద వృక్షాలు పాదచారులకు, వాహనచోదకులకు నీడనిస్తున్నాయి. పెద్దలు నాటిన వృక్షాలు నేడు ఈ దారిలో ఎందరికో నీడనిస్తున్నాయి. విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షణకు పాటు పడాల్సిన అవసరాన్ని ఈ చిత్రం చాటి చెబుతోంది.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈవోలు తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులతో కలిసి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థిమిత్ర కిట్లకు సంబంధించి అథెంటిఫికేషన్ పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు.

పరిశోధన సంస్థలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పరిశోధనా సంస్థలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు సూచించారు. వీఎస్‌యూలో శుక్రవారం అంతర్జాతీయ సదస్సు పోస్టర్లను ఆయన విడుదల చేశారు. సెప్టెంబర్ 16, 17 తేదీలలో పర్యావరణంపై అంతర్జాతీయ సదస్సు జరగనుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, అధ్యాపకులు డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, ప్రొఫెసర్లు ఎల్ వీరాంజనేయ రెడ్డి, కే మల్లికార్జున్, పీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


కొత్త పాసు పుస్తకాలు వచ్చేశాయ్...

మనుబోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొత్త పట్టదారు పాసుపుస్తకాలు అందించనుంది. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి సీఎం జగన్ చిత్రం వేసి ఇచ్చేవారు. కానీ ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలపై ప్రభుత్వ రాజముద్ర ఉండాలని నిర్ణయించింది. గతంలో ఇచ్చిన పాసు పుస్తకాలను రద్దు చేసింది. దీంతో మండల రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంది. శుక్రవారం కొత్త పాసుపుస్తకాలు చేరాయి. త్వరలోనే వీటిని రైతులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు.


జిల్లాకు వరం.. మైపాడు బీచ్!

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

● కేరళ తరహా టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చంద్రబాబు సంకల్పం



ఇందుకూరుపేట : గుడిలో పూజలు చేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కొడవలూరు : నూతనంగా నియమించిన సొసైటీ చైర్మన్‌లతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు బీచ్‌ను సమగ్ర ప్రణాళికతో కేరళ తరహా టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మైపాడులో బీచ్ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో పాటు టూరిజం అధికారులతో చర్చించారు. బీచ్ సమీపంలో నిర్మిస్తున్న బంగారమ్మ తల్లి ఆలయ ముఖద్వార ప్రతిష్ఠ కార్య క్రమంలో ఆమె పాల్గొన్నారు. మైపాడు బీచ్ సమీపంలో వున్న ఉప్పు కాలువలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పీ4 కార్యక్రమం ద్వారా సిల్ట్ క్లియరెన్స్‌కు ముందుకు వచ్చిన స్థానికులను ఎమ్మెల్యే అభినందించారు. సిల్ట్ క్లియరెన్స్ వల్ల మత్స్యకారుల బోట్లు నేరుగా సముద్రంలో వెళ్లేందుకు రూట్ క్లియర్ అవుతుందన్నారు. దాదాపు 6 కి.మీ మేర ఉన్న ఉప్పు కాలువలో కేరళ తరహా బోట్ రైడింగ్స్ నిర్వహించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చన్నారు. నెల్లూరు జిల్లాలో వున్న ఏకైక పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మైపాడులో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే హోటళ్లు, రిసార్ట్‌లు, హోమ్ స్టేలు, ఫుడ్ కోర్టులు వంటి సౌకర్యాల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి దొరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, పీఎల్ రావు, చెంచుకిషోర్ యాదవ్, అవ్వారు ఏడు కొండలు, నరసింహులు, సురేంద్ర, అధికారులు, టీడీపీ కార్యకర్తలు, మైపాడు కాపులు పాల్గొన్నారు.

కోవూరు: రైతుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని పడుగుపాడు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్నదాతలకు నామమాత్రపు వడ్డీతో రుణ సదుపాయం కల్పి స్తున్నట్లు వివరించారు. పడుగుపాడు సొసైటీ అధ్యక్షులుగా నాగారెడ్డి శ్యామ సుందర రెడ్డి, డైరక్టర్లుగా నర్రా శ్రీనివాసరావు, నాగిరెడ్డి జయశంకర్, సొసైటీ అధ్యక్షులుగా తన్నీరు రాజయ్య, డైరక్టర్లుగా బాడుగ మస్తానయ్య, వరికొండ సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, టీడీపీ నాయకులు చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, సొసైటీ సీఈఓ కే గోవర్దన్ రెడ్డి పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : రామచంద్రాపురం గ్రామంలో సర్వే చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులపై సమగ్ర వివరాలతో వారంలోపు నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రామచంద్రా పురంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి, నాయకులతో కలిసి పర్యటించారు. పీ4 కార్యక్రమంలో భాగంగా బుచ్చి నగర పంచాయతీలో 20వ వార్డు పరిధిలోని రామచంద్రాపురం గ్రామాన్ని వీపీఆర్ ఫౌండేషన్ తరఫున ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, తాను దత్తత తీసుకున్నామన్నారు. టీడీపీ అర్బన్, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, పెంచలయ్య, రామ చంద్రారెడ్డి, రమణారెడ్డి, సునీల్, పెంచలయ్య సురేంద్ర పాల్గొన్నారు.

కొడవలూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాలెం పీఎస్ఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం యల్లాయపాలెం, గుండాలమ్మ పాలెం, తలమంచి సొసైటీ చైర్మన్లుగా నూతనంగా నియమితులైన ఏకొల్లు వంశీధరరెడ్డి, బద్వేల్ వినీల్‌రెడ్డి, పి.సూర్యనారాయణల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని వారిచేత ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవీఎస్ శేఖర్‌రెడ్డి, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు, కేతు వెంకటరమణా రెడ్డి, చెక్క మదన్, కరకటి మల్లికార్జున్, గరికపాటి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

కాకాణి బెయిల్ షరతు పాక్షిక సవరణ

● నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించకూడదన్న షరతుపై తదుపరి విచారణ వరకు స్టే

● రేపు దర్యాప్తు అధికారి ముందు హాజరవండి

● కాకాణికి హైకోర్టు ఆదేశం... విచారణ 29కి వాయిదా

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ విధించిన ఓ షరతును హైకోర్టు పాక్షికంగా సవరించింది. కేసు దర్యాప్తు ముగిసి, చార్జిషీట్ దాఖలు చేసే వరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని, ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని షరతులు విధించామని న్యాయస్థానం గుర్తుచేసింది. ఈ రెండు షరతులు పరస్పర విరుద్ధంగా ఉన్న నేపథ్యంలో చార్జిషీట్ దాఖలు చేసేవరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని విధించిన షరతుపై తదుపరి విచారణ వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే ఆదివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని కాకాణికి స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్‌తోపాటు కాకాణిపై నమోదైన ఇతర కేసుల్లో కోర్టు విధించిన షరతులన్నింటినీ పరిశీలించిన అనంతరం షరతుల సవరణపై తగిన ఉత్తర్వులు ఇస్తామని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేస్తూ విధించిన షరతులను సవరించాలని కోరుతూ వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి అనుబంధ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు రాగా వివిధ కేసుల్లో కోర్టులు కాకాణికి విధించిన షరతులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయమూర్తి ముందు ఉంచారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి... షరతుల సడలింపు విషయంలో పీపీ అభిప్రాయాన్ని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ బదులిస్తూ... కోర్టు విధించిన షరతులను ఉల్లంఘించి జైలు నుంచి విడుదలైన వెంటనే పిటిషనర్ మీడియాతో మాట్లాడారని చెప్పారు. ఆయన ఉపయోగించిన భాష కేసులో సాక్షిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యేను బెదిరించేలా ఉందని తెలిపారు. పిటిషనర్‌ను నెల్లూరు జిల్లాలోకి అనుమతిస్తే కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. గతంలో నెల్లూరు కోర్టులో ఉన్న రికార్డులను తారుమారు చేసిన విషయంలో పిటిషనర్‌పై కేసు ఉందని గుర్తుచేశారు. కోర్టు విధించిన షరతులు సహేతుకంగానే ఉన్నాయని, ప్రతీ ఆదివారం దర్యాప్తు అధికారి ముందు హాజరై, జిల్లా విడిచి వెళ్లేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాది ఓ. మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ వివిధ కేసుల్లో దర్యాప్తు అధికారుల ముందు హాజరు కావాల్సి ఉందని విన్నవించారు.

C.R.I.M.E N.E.W.S

22.5 కేజీల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్ ● నిందితులు చెన్నై నగరవాసులు



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): గంజాయిని గుట్టుచప్పుడు కాకుం డా తరలిస్తున్న ఇద్ద రు వ్యక్తులను నెల్లూ రు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ శుక్రవారం తన కార్యాలయంలో నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. రైల్వే సీఐ సుధాకర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. చెన్నై నగరానికి చెందిన పళని రాజేష్, జుబునీషా అనే ఇద్దరు ఒడిశా రాష్ట్రం రాయఘడ్ నుంచి రైలులో వచ్చి నెల్లూరు స్టేషన్‌లో దిగారు. ఇక్కడి నుంచి చెన్నై వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వారి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా రాజేష్ వద్ద 14.5 కేజీలు, జుబునీషా వద్ద 8 కేజీలు కలిపి మొత్తం రూ.4.50 లక్షల విలువ చేసే 22.5 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నెల్లూరు రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నామని చెప్పారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని పట్టుకున్న సీఐ, ఎస్ఐ హరిచందన, ఆర్పీఎఫ్ ఎస్ఐ శివరూపావత్, సిబ్బంది జయప్రకాష్, మణికంఠ, కిరణ్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో నెల్లూరు రైల్వే సీఐ ఏ సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీ రమేష్‌గౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రాసిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడు అల్లూరు వాసి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రాసిన నిందితుడిని దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జిల్లాలోని అల్లూరు మండలం పడమటి గోగులపల్లికి చెందిన వాలిమేటి నాగమణికుమార్ అల్లూరులో నివాసం ఉంటున్నారు. ఆయన ఆరు నెలల కిందట నగరంలోని హరనాథపురంలో ఉన్న బావమరిది ఇంటికి వచ్చారు. బావమరిది పిండిమిల్లులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ఈజీగా డబ్బు సంపాదించడం ఎలా అని మణికుమార్ సామాజిక మాధ్యమాల్లో శోధిస్తూ ఉండేవారు. ఈక్రమంలో నక్సల్స్ బెదిరింపు లేఖలు ఎలా రాస్తారు అన్న అంశంపైనా సెర్చ్ చేశారు. ఆ వీడియోలు చూసి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి లేఖ రాశారు. రూ.2కోట్లు నగదు ఇవ్వకపోతే చంపేస్తానని లేఖ రాసి ఈ నెల 18వ తేదీ వేమిరెడ్డి ఇంటి సెక్యూరిటీకి ఇచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆ లేఖను పరిశీలించి ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యేకు సమాచారం అందజేశారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్గామిట్ట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేశారు. సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితుడు అల్లూరు ప్రాంతానికి చెందిన నాగమణి కుమార్‌గా గుర్తించి అరెస్ట్ చేశామని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య తెలిపారు.

బంగారు, వజ్రాల నగలు, నగదు చోరీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి లోపలికి ప్రవేశించి బంగారు నగలు, నగదు, వజ్రాల హారాన్ని గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ చోరీ శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరులోని లేక్‌వ్యూ కాలనీలో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు... వెదురు బొంగుల వ్యాపారం చేసే వెంకటేశ్వర్లు కుటుంబం లేక్‌వ్యూ కాలనీలో నివసిస్తోంది. ఆయన భార్య కొద్ది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఈనెల 21వ తేదీ వెంకటేశ్వర్లు వ్యాపార నిమిత్తం ఆత్మకూరుకు వెళ్లారు. రాత్రి ఇంటికి రాలేదు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున ఆ ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులోని సుమారు ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్, కొంత నగదు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన వెంకటేశ్వర్లు తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులను దోచుకెళ్లారని గుర్తించారు. వెంటనే దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని చెన్నై వాసి మృతి



కమలనాథన్ మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని చెన్నైకి చెందిన 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి శుక్రవారం కావలి పట్టణం మద్దూరు పాడు సమీపంలోని కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహ దారి పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఫిట్స్ వచ్చి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ తిరులరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న సంచిలో లభించిన చిన్న కీపేడ్ ఫోన్‌లోని నెంబర్ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు తెలిపిన వివరాల మేరకు మృతుడు చెన్నైకు చెందిన కమలనాథన్‌గా గుర్తించారు. అతను మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

ఆస్తి వివాదంలో తండ్రీకొడుకులపై దాడి

కొండాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంలో తండ్రీకొడుకులపై బంధువులు దాడి చేసిన ఘటన శుక్రవారం మండలంలోని గరిమెనపెంట పంచాయతీ వెంకటరంగాపురంలో జరిగింది. బాధితుడు డేగ రాము తెలిపిన వివరాల మేరకు.. రాము, అతని తమ్ముడు డేగ మల్లికార్జున మధ్య ఆస్తి విషయంలో వివాదం ఉంది. ఈ క్రమంలో పొలంలోకి వస్తే ఈ సమస్యను పరిష్కరించుకుందామని అన్నను తమ్ముడు మల్లికార్జున పిలిచాడు. దీంతో రాము, అతని కుమారుడు మణి పొలంలోకి వెళ్లారు. వారిపై రాము తమ్ముడు మల్లికార్జునతోపాటు బంధువులు పసుపులేటి రాహుల్, డేగ మహేష్, సుశీల, వసంత, పీ.శ్రీనివాసులు, ఇందు, పసుపులేటి లక్ష్మి తదితరులు మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల రైతులు అక్కడికి చేరుకుని దాడిని అడ్డుకున్నారు. ఈ దాడిలో రాము, అతని కుమారుడు మణికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అక్కడి నుంచి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. గాయపడిన వారిని ముందు కావలి ఏరియా వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని పోలీసులు సూచించారని, అక్కడ నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని చెప్పడంతో వారిని ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	103
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100):	525



క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించాలితతతతత : డీఏవో సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంటల సాగు, చీడపీడల సమస్యలు తదితర అంశాలపై మండల వ్యవసాయశాఖ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి సూచించారు. శుక్రవారం నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానం(ఏఆర్ఎస్)లో ఆగస్టు నెల శిక్షణ, పరిశీలన సమావేశం జరిగింది. రైతులకు ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందడం పై చర్చించారు. అదేవిధంగా పంటలకు ఆశించిన చీడపీడలను పలువురు సమావేశంలో తెలియజేయగా శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి, ఆత్మ పీడీ మురళి, ఏఆర్ఎస్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త ప్రసన్నరాజేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



దోమ కాటు వ్యాధుల నివారణకు కృషి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దోమకాటుతో వచ్చే ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోందని మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ తెలిపారు. దీనికి సంబంధించి చేపడుతున్న కార్యక్రమాల వివరాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

?: జిల్లాలో ప్రాణాంతక వ్యాధుల నమోదు ఎలా ఉంది.

!: మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. ఆయా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 19 డెంగ్యూ కేసులు, మలేరియా కేసులు 3 నమోదయ్యాయి.

?: వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

!: మలేరియా, డెంగ్యూ కేసులు వెలుగు చూసిన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాము. చుట్టు పక్కల వారికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చర్యలు చేపట్టాం. మలేరియా, డెంగ్యూ సోకినట్లు గుర్తించిన వారికి వైద్య చికిత్సలు అందిస్తున్నాం. వీటికి ప్రతి పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నాయి.

?: దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలేమిటి.

!: వ్యాధికారక దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని ఒలకబోస్తున్నాము. టైర్లు, కొబ్బరి చిప్పలు, తొట్లలో ఉన్న నీటి నిల్వలను తొలగిస్తున్నాము.

?: ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు సూచిస్తున్న జాగ్రత్తలు ఏమిటి.

!: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షాల వల్ల పలు ప్రాంతాల్లో నీరు చేరుతుంది. ఆ నీటిలో దోమలు గుడ్లు పెడతాయి. ఆ గుడ్లు దోమలుగా మారకుండా లార్వా దశలోనే నివారిస్తే మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి బయటపడవచ్చు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

రేపు కంటి వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని బాలాజీనగర్ గౌడ హస్టల్ సెంటర్‌లో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, సీపీఎం నాయకుడు బొమ్మ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం బాలాజీనగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. వాసన్ ఐకేర్ ఆసుపత్రి, దాతల సహకారంతో అవసరమైన వారికి మందులు, అద్దాలు ఇస్తామని, ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శేఖర్, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



ఆహార నాణ్యతను ఆరా తీస్తున్న ఎస్ఈ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం కూడలిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఆహారం స్వీకరిస్తున్న వారితో మాట్లాడారు. ఆహారం రుచి, నాణ్యత, తాగునీరు, పరిశుభ్రతపై ఆరా తీశారు. టోకెన్ విధానంలోనే ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు.



రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న భక్తులు



అమ్మవారికి అలంకరించేందుకు సిద్ధం చేసిన వరికంకులు

శ్రావణ లక్ష్మి కరుణజూపవే..!

● భక్తిశ్రద్ధలతో ఆఖరి శుక్రవారం పూజలు

● సామూహిక కుంకుమార్చనలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా నగరంలోని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు, లక్ష కుంకుమార్చన, అన్న ప్రసాద వితరణ జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

● రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు, సామూహిక లక్ష కుంకుమార్చన జరిగాయి. రాష్ట్రమంతా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఉభయకర్తలు కొలపర్తి రమేష్ దంపతులు అమ్మవారికి వరి కంకులతో ప్రత్యేక అలంకారం చేయించారు. మహిళా భక్తులు రాహుకాల దీపారాధనలు చేశారు.

● స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి కుంకుమతో ప్రత్యేక అలంకారం జరిగింది. పూలంగిసేవ, 108 మంది ముత్తైదువులకు పసుపు, కుంకుమ, రవిక, గాజులు అందజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, అధ్యక్షుడు కోట గురు బ్రహ్మం, కార్యదర్శి చిరంజీవి,



ప్రత్యేక అలంకారంలో కన్యకాపరమేశ్వరి

కోశాధికారి జనార్దన్, గౌరవ సలహాదారుడు ఎంపీ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● పొగతోట ఆదిశంకర ధ్యానమందిరంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు జరిగాయి. మందిరం కమిటీ అధ్యక్షుడు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యం శర్మ, చక్రాల నాగరత్నకుమారి, బాచిరాజు లక్ష్మీసుజాత, తదితరులు పర్యవేక్షించారు.

● దర్గామిట్ట రామ్‌నగర్‌లోని చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారికి చీరల అలంకారం జరిగింది. 25 చీరలతో అలంకారం చేశారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఉభయకర్తలుగా వేణుంబాక శివకల్యాణ్ రెడ్డి, చైతన్య వ్యవహరించారు. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారికి ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. ఉదయం మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరిగాయి.

● గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.

ఆక్వా రంగానికి ప్రభుత్వాల ప్రాధాన్యం

● కేవీకే కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి పేర్కొన్నారు. కేవీకేలో కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై ఆక్వా రైతులకు శుక్రవారం నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనను రైతులకు వివరించారు. నూతన సాంకేతిక ఆవిష్కరణలపై ఆదిశంకర విశ్వవిద్యాలయంలోని అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ జే యోగ నరసింహులు నాయుడు, కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై కేవీకే మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాదు తెలియజేశారు. ఆక్వా రంగంలో అందుబాటులో ఉన్న అత్యాధునిక పరికరాలు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ లోకేష్‌బాబు రైతులకు వివరించారు.



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి, పక్కన శాస్త్రవేత్తలు

కానిస్టేబుల్‌కు సన్మానం

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్‌గా ఎంపికైన మనోజ్‌ను శుక్రవారం సీఐ వేమారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యూనెక్స్-సన్‌రైజ్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని నారాయణ విద్యా సంస్థల జీఎం, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో సమానంగా క్రీడల్లో కూడా రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర సబ్ జూనియర్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న వీబీఆర్, కోటంరెడ్డి, ముక్కాల

పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 238 మంది క్రీడాకారులు హాజరయ్యారని, మూడు రోజులు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి అంకమ్మ చౌదరి, జిల్లా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం ప్రసాద్‌రావు, కోశాధికారి గాదంశెట్టి శ్రీకాంత్, చౌదరి జ్యువెలర్స్ ఎండీ రాకేష్ చౌదరి, కార్పొరేటర్ మురహరి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ నిరసన

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,400కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని,



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వెంటనే విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు టీ విక్రమ్, వీ నరేంద్ర, నాయకులు విష్ణు, నాగేంద్ర, దివేశ్, మస్తాన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో చెత్త సేకరణ ఎలా?

● నగర కమిషనర్ పరిశీలన

నెల్లూరు(సిటీ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమల్లో భాగంగా తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు నెల్లూరు నగర్ కమిషనర్ నందన్ వెళ్లారు. వ్యర్థాల నిర్వహణపై పరిశీలనకు రాష్ట్ర పురపాలక శాఖ నేతృత్వంలో పలువురు కమిషనర్ల బృందాలను తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు పంపారు. ఇందులో భాగంగా శుక్రవారం చెన్నైలో స్టడీ టూర్ నిర్వహించారు. బయో మైనింగ్, ఇంటింటి చెత్త సేకరణ, సత్యవేడులో చికెన్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంటును ఈ బృందం పరిశీలించినట్లు కమిషనర్ తెలిపారు.



చెత్త ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్లు

విజయలక్ష్మికి అభినందనలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన గునుకుల విజయలక్ష్మికి శుక్రవారం బలిజ సేవాసమితి సభ్యులు ఆమె నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఏఎంసీ డైరెక్టర్ పదవికి పూర్తి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకుడు డాక్టర్ పోకల రవి, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



విజయలక్ష్మిని అభినందిస్తున్న బలిజ సేవా సంఘం నాయకులు

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

● ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాలి : రూరల్ సీఐ

నెల్లూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసు శాఖ నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. శుక్రవారం ఆయన స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఉత్సవ కమిటీలు లిఖిత పూర్వక వినతులు సమర్పించి అనుమతులు పొందాలన్నారు. ఎన్నిరోజులైతే విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉంచుతారో అన్ని రోజులు రాత్రిపూట ఉత్సవ కమిటీ సభ్యుల్లో ఒకరు విధిగా అక్కడే ఉండాలని స్పష్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలకు ఉత్సవ కమిటీలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

● చవితి చందాల కోసం దాడి

వినాయక చవితి చందాల కోసం యువకులు



శృతి మించి దందాలకు పాల్పడుతున్నారు. మండలంలోని ఆమంచర్ల, మట్టెంపాడు గ్రామాల వద్ద యువకులు వేప మండలతో రోడ్డుపై అడ్డంగా నిలబడి ద్విచక్ర వాహన దారులను ఆపుతున్నారు. చందా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా ఇవ్వనని చెబితే వారిని వేప మండలతో కొడుతూ దురుసుగా, అసభ్యకరంగా ప్రవరిస్తున్నారు. దీనికి సంబంధించి సీఐ వివరాలు సేకరిస్తున్నామన్నారు.

'స్మార్ట్' దుకాణాలకు లాటరీ

120 మందికి షాపుల కేటాయింపు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మైపాడు రోడ్డు వెంబడి వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజారులో దుకాణాలను శుక్రవారం లాటరీ పద్ధతిన లబ్ధిదారులకు అందచేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా పీడీ లీలారాణి, ఎస్ఎంసీ సెక్రటరీ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో లాటరీ నిర్వహించారు. 120 మందికి దుకాణాలను కేటాయించారు. పురపాలక శాఖ నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోనే తొలిసారి నెల్లూరులో ఈ స్మార్ట్ స్ట్రీట్ బజార్ ఏర్పాటు చేసిందని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న మెప్మా పీడీ లీలారాణి

అదనపు బస్సు కోసం విద్యార్థుల ఆందోళన



జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సీతారామపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం నుంచి డీజీ పేట మార్గంలో అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం పలువురు విద్యార్థులు పబ్బులేటిపల్లి గ్రామ సమీపాన గల జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయాన్నే ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు కేవలం ఒక ట్రిప్పు మాత్రమే డిజి పేట వరకు వెళ్లి తిరిగివస్తుందని, ఈమార్గంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు, ఇతరత్రా పనుల కోసం సీతారామపురం మండల కేంద్రానికి అనేకమంది ఇదే బస్సులో ప్రయాణిస్తుండంతో బస్సులో కూర్చునేందుకు సీట్లు సరిపోక పోవడంతో నిలబడి, డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోయారు. ఈవిషయమై గతంలో ప్రయాణికులు నిరసన వ్యక్తం చేయడంతో కొద్దిరోజుల పాటు ఆర్టీసీ బస్సు ఉదయం పూట రెండు ట్రిప్పులు తిరిగేదని, ప్రస్తుతం ఒక ట్రిప్పుకే పరిమితం చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతూ, భయం భయంగా బస్సులో ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉదయగిరి డిపో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి డీజీపేట మార్గంలో అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

● 10 మందికి గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేట గ్రామంలో గురువారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలోని పది మందిని కరిచి తీవ్రంగా గాయపర్చింది. గ్రామస్థులు వెంటాడి కుక్కను చంపేశారు. గాయపడిన వారంతా ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం లో గురు, శుక్రవారాల్లో వ్యాక్సిన్ వేయించుకున్నారు. గ్రామంలో సుమారు 150 వీధికుక్కలు ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

సబ్సిడీపై కిసాన్ డ్రోన్ పంపిణీ

ఏఎస్ పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం సబ్సిడీపై కిసాన్ డ్రోన్‌ను వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనుమసముద్రం గ్రామంలోని జ్యోతి రైతు సేవా సంఘం రూ. 2లక్షలు, ప్రభుత్వ రాయితీ రూ. 7.8లక్షలు కెనరా బ్యాంక్ సహకారంతో డ్రోన్ కంపెనీకి అందించడంతో వారు డ్రోన్‌ను అందించారు. దానిని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, డ్రోన్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ యోగేశ్వర్, వ్యవసాయ సహాయకులు లావణ్యలు రైతు సంఘ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ అధికారులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

విద్యార్థులు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఏఎస్‌పేట ఎస్ఐ సైదులుతో కలిసి శ్రీకొలను గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



అశ్వారూఢుడై దర్శనమిచ్చిన వెంకయ్యస్వామి

వెంకటాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా వెంకయ్య స్వామి అశ్వారూఢుడై శుక్రవారం ఉదయం గొలగమూడి గ్రామంలో విహరించారు. నిత్య పూజలతోపాటు ఉదయం 10 గంటలకు అశ్వవాహనసేవ ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. స్వామి అశ్వవాహనాన్ని అధిరోహించి, వామన హస్తంతో కళ్లాలను చేతబట్టి.. 'మనిషి కోరికలనే గుర్రాలకు కళ్లెం వేయాలి' అని భక్తులకు హితబోధ చేస్తున్నట్లుగా దర్శనమిచ్చారు. 'నేనుండగా మీకు చింత ఏల' అన్నట్లుగా దక్షిణ హస్తం పైకెత్తి భక్తులను ఆశీర్వదిస్తూ చిరుదరహాసంతో వీధుల్లో ఊరేగారు. రాత్రికి అవధూత వెంకయ్యస్వామి పెదశేషవాహనంపై కొలువుదీరారు. వివిధ రకాల పుష్పాలంకరణతో స్వామిని పెదశేష వాహనంపై కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర నీరాజనాలు అందించి తీర్థ ప్రసాదాలను స్వీకరిం చారు. ఉభయకర్తలచే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించాయి.

నేడు సింహ, గరుడ వాహన సేవలు

ఉత్సవాలలో భాగంగా స్వామికి శనివారం ఉదయం సింహవాహన సేవ, రాత్రికి గరుడ వాహనసేవ జరుగుతాయని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహిస్తామన్నారు.

సోమేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



కందుకూరు పట్టణంలోని స్కంధపురి సోమేశ్వరాలయంలోని మూల విరాట్‌ను శుక్రవారం సూర్యకిరణాలు తాకాయి. శ్రావణమాసం మాస శివరాత్రి సందర్భంగా భానుడు సోమే శ్వరుడిపై ప్రసరించటంతో ఆలయ పూజారులు, భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ప్రతి ఏటా మాసశివరాత్రి నాడు సోమేశ్వరుడిని సూర్య కిరణాలు తాకుతాయని, మూడురోజులపాటు ఈ అనుభూతి భక్తులు పొందవచ్చని పూజారులు తెలి పారు. కాగా శుక్రవారం భక్తులు పెద్దసంఖ్యలో సోమేశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

- కందుకూరు (ఆంధ్రజ్యోతి)



వైభవంగా శ్రీకృష్ణ నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు నగరంలో శుక్రవారం శ్రీకృష్ణుని నగరోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక డైకస్‌రోడ్డులో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించి ఆరు రోజులు పూజించారు. ఆ ఉత్సవాల ముగింపు సందర్భంగా నగరోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతా జ్ఞాన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఇక పక్కాగా సాగు భూమి

నూతన విధానంలో ఈ-క్రాప్

రైతులు లేకున్నా నమోదు ప్రక్రియ

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పొలంలో ఒక పంట సాగవుతుంటే మరో పంటను సాగుచేస్తున్నట్లు పంట నమోదు చేసేవారు. పొలాలు ఖాళీగా ఉన్నా ఏదో ఒక పంట సాగవుతున్నట్లు చూపించే అవకాశం ఉండేది. అంతేగాక చెరువులు, చివరికి పోరంబోకు స్థలాల్లో కూడా వివిధ రకాల పంటలు సాగవుతున్నట్లు ఈ-క్రాప్‌లో చూపించి అవినీతి జరిగే అవకాశం ఉండేది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఎంత మేర ఉన్నాయనే సమాచారం సరిగా ఉండది కాదు. దీంతో అనేక అక్రమాలకు తెరలేపేందుకు అవకాశం ఉండేది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం చెక్‌పెడుతూ సరికొత్త విధానంలో ఈ-క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టింది. ఈ-క్రాప్ నమోదుకు గతంలో రైతుల ఈకేవైసీ తీసుకునేవారు. రైతులు అందుబాటులో లేకపోతే వారి వివరాలు నమోదయ్యే అవకాశం ఉండేది కాదు. ప్రస్తుత విధానంలో రైతులు లేకున్నా ఈ-క్రాప్ నమోదు చేస్తారు. ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా పారదర్శకంగా చేసేందుకు రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు.

● ఈసారి ఇలా...

ఈ-క్రాప్ నమోదుకు గతంలో 100మీటర్ల పరిధిలో ఫొటోలు తీస్తే సరిపోయేది. అయితే ఇందులో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈసారి ప్రతి 20 మీటర్ల పరిధిలో ఫొటోలు తీసి పంట నమోదు చేయాల్సిందే. లేదంటే యాప్ అంగీకరించదు. అయితే క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న ఇబ్బందుల దృష్ట్యా 50మీటర్లకు ఇటీవల అనుమతులు వచ్చాయి. ఈయాప్‌లో పంటల సాగుకు ఉపయోగకరమైన భూముల వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయానికి అనువుకాని భూములను గతంలో నమోదు చేసి ఉంటే వాటిని తొలగిస్తారు. ప్రతి సర్వే నెంబరు ఫొటో తీయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉద్యాన పంటలనూ తప్పని సరిగా చేయాల్సిందే. ఖాళీ పొలాలను నమోదు చేసి పంట లేదని నమోదు చేయాలి. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది నమోదు చేసిన తరువాత వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలిస్తారు. అభ్యంతరాలు ఉన్న భూములు ఏమైనా ఉంటే జిల్లా ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుంటారు. కౌలు రైతులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి భూ యజమానితోపాటు కౌలు రైతుల వివరాలు కూడా నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో పంటలు దెబ్బతింటే ప్రభుత్వం అందిం చే బీమా పొందాలంటే ఈ-క్రాప్ నమోదు కీలకం. కాబట్టి భూయజమానికి అదేవిధంగా పొలం కౌలుకిస్తే కౌలు రైతులకు బీమా అందుతుంది.



దొంతాలి గ్రామంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న నెల్లూరు మండల వ్యవసాయాధికారి నాగమోహన్

ప్రతి సర్వే నెంబరు నమోదు చేయాలి



ఈ-క్రాప్ నమోదు గతంలో రైతులు వచ్చి నమోదు చేసుకోవాలి. నూతన విధానంలో ప్రతి సర్వే నెంబరులో పంటను డిజిటల్ సర్వేలో నమోదు చేయాలి. పంటలు సాగు చేసినా, చేయకపోయినా నమోదు చేయాలి. కౌలు రైతులు సాగు చేసుకుంటున్న భూములకు కూడా భూయజమాని, కౌలు రైతుల వివరాలు సర్వేలో నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో భూయజమానికి బీమా వర్తిస్తుంది. కౌలుకు ఇచ్చిఉంటే కౌలు రైతుకు దక్కుతుంది. జిల్లాలో 2,64,071 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవుతుండగా దాదాపు 1,02,673 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేయడం జరిగింది. ఇందులో 1,33,522 ఎకరాల్లో వరి సాగవుతుండగా దాదాపు 68496 ఎకరాల్లో నమోదు చేయడం జరిగింది. వీలైనంత త్వరగా ఈ-క్రాప్ నమోదు పూర్తిచేస్తాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

విజృంభిస్తున్న వ్యాధులు

కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు

తూతూమంత్రంగా పారిశుధ్య పనులు



ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతంలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ప్రతిఒక్కరూ జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు క్యూకడుతున్నారు. వైరల్ జ్వరాలతోపాటు పలువురికి రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో రక్తకణాలు తగ్గి ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, ఒక్కసారిగా మారిన వాతావరణంతో పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం, అధికారులు తూతూమంత్రంగా పారిశుధ్యం చర్యలు చేపట్టడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

వైద్యశాలలకు పరుగులు

ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు తదితర పట్టణాలు, గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి గత వారం రోజులుగా రోజుకు 200 నుంచి 250 మంది రోగులు వస్తుండగా అందులో 70 నుంచి 80 మంది జ్వరపీడితులేనని, కొంతమంది వాంతులు, విరోచనాలతో బాధపడుతూ వస్తున్నారని వైద్యులు తెలుపుతున్నారు. రోగుల తాకిడి అధికంగా ఉండడం, వైద్యుల కొరత ఉండడంతో బాధితులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అలాగే స్థానికంగా ఉండే ప్రైవేటు వైద్యశాలలకు సైతం జ్వరపీడితులు అధికంగా వస్తున్నారని వైద్యులు తెలుపుతున్నారు. ఇటీవల ఉదయగిరి పట్టణంలోని ఓ చిన్నారికి రోజుల తరబడి జ్వరం తగ్గక రక్తకణాలు తగ్గి చెన్నైలో చికిత్స పొంది వచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరం స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతోపాటు జ్వరాల నివారణకు వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరి పట్టణంలో ప్రధాన రహదారికి పక్కనే అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

వైరల్ జ్వరాలే ఎక్కువ

సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 70 నుంచి 80 మంది జ్వరపీడితులే వస్తున్నారు. కొంతమంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వస్తున్నారు. వారందరికీ వైద్యసేవలందిస్తున్నాం. వైరల్ జ్వరాలతో అధికంగా బాధపడుతున్నారు.

- రాగూర్, సీహెచ్‌సీ వైద్యుడు

నేడు, రేపు రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శని, ఆదివారాల్లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బీ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా జట్లు పాల్గొంటున్నాయని, వీరికి తగిన వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు.

క్షయ బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేయండి

● ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీల్లో ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆసుపత్రులకు క్షయ వ్యాధిగ్రస్తులు వస్తే వారిని ప్రభుత్వ క్షయ ఆసుపత్రికి సిఫార్సు చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. శుక్రవారం నెల్లూరులోని వైష్ణవి, సాయిపథం, మధుసూదన్‌శాస్త్రి ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందని తెలిపారు. అంతేకాకుండా పౌష్టికాహార నిమిత్తం రూ.6 వేలు వారి ఖాతాలో జమచేస్తుందని చెప్పారు. ఇంటెన్సిఫైడ్ టీబీ విముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ప్రైవేట్ ప్రాక్టీషనర్లు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్, ప్రైవేట్ హాస్పిటల్స్ కో ఆర్డినేటర్ హరీష్, భవ్య, తులసీరామ్, సరిత, అనూరాధ పాల్గొన్నారు.



ఓ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి ఖాదర్‌వలి

29 నుంచి తెలుగు భాషోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై ఈనెల 29 నుంచి 31వతేదీ వరకు అవగాహన సదస్సులు జరుగుతాయని నిర్వాహకులు కంచర్ల సుబ్బానాయుడు, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, పెరుగు రామకృష్ణ తెలిపారు. నెల్లూరులోని టౌన్ హాలులో జరిగే సదస్సులకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. భాషోత్సవాలను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో ప్రముఖ భాషాకోవిదులు, విమర్శకులు, కళాకారులు పాల్గొంటారని, జిల్లా ప్రజలు తరలిరావాలని కోరారు.



తెలుగు భాషోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభం

రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 26 వరకు గడువు

పొదలకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. గతంలో ఆన్‌లైన్‌లోపాటు ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీరించనున్నట్లు ప్రకటించినా ప్రస్తుతం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 26 వరకు గడువు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఓసీ విద్యార్థులకు రూ.400, బీసీలకు రూ.300. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.200గా నిర్ణయించారు. సెప్టెంబరు 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. నచ్చిన కళాశాల, కోర్సులో సీటు కావాలంటే విద్యార్థులు సాధ్యమైనంత ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలి.

● ఇవి తప్పనిసరి

పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా, ఇంటర్ టీసీ, ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు.

● రిజిస్ట్రేషన్లకు గడువు

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ వెరిఫికేషన్ (స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, పీహెచ్‌సీ), 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు, ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉంది. 29న సీట్ల కేటాయింపు, 31వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయి.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షూటింగ్ బాల్ జిల్లాస్థాయి టీమ్ ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈపోటీలను స్థానిక జడ్పీ హెచ్‌ఎం బుజ్జయ్య ప్రారంభించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా టీమ్‌కు ఎంపికచేసి బుచ్చిరెడ్డిపాళెంలో శిక్షణ ఇవ్వనున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవి రమణయ్య తెలిపారు. సెప్టెంబరు 13, 14 తేదీల్లో బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.



జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం బుజ్జయ్య

వీఎస్‌యూకి ఇది గొప్ప అవకాశం

● వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చెన్నై నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో వీఎస్‌యూ మెరైన్ బయాలజీ విభాగం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం వీఎస్‌యూకి ఒక గొప్ప అవకాశమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. వీఎస్‌యూలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఒప్పందం వివరాలను వెల్లడించారు. మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల నిధులు ఈ ఒప్పందం ద్వారా మంజూరయ్యాయన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫెలోషిప్ సౌకర్యం ఉంటుందన్నారు. లాబరేటరీ సామగ్రి కోసం రూ. 2.12 కోట్ల నిధులు కేటాయించామన్నారు. మరిన్ని సదుపాయాలు కూడా కల్పించినట్లు తెలిపారు. మెరైన్ బయాలజీలో పీజీ చేసే అవకాశం రాష్ట్రంలో వీఎస్‌యూలో మాత్రమే ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, ఎస్ సాయిప్రసాద్‌రెడ్డి, చాముండేశ్వరి, డాక్టర్ జీ సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

రైల్వే పనుల్లోనూ నాణ్యతకు తిలోదకాలు!

పైన పటారం.. లోన లొటారం

వేస్టేజ మట్టిపై కాంక్రీట్ ప్లాట్‌ఫారం నిర్మాణం

రైల్వే స్టేషన్ ఆవరణలో ప్లాట్‌ఫారం వేసేందుకు తోలిన వేస్టేజీ మట్టి



కావలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : రైల్వే నిర్మాణ పనులు అంటే ఒకప్పుడు నాణ్యతకు పెట్టింది పేరు. కానీ రాను రాను రైల్వే పనుల్లో కూడా లోకల్ కాంట్రాక్టర్లు చేరి నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నా అధికారులు మౌనంగా ఉంటున్నారు. కావలి రైల్వే స్టేషన్‌ను నూతనంగా నిర్మించిన తర్వాత దాని ముందు భాగంలో గతంలో రెండు భాగాలు పైగా సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్‌ఫారం పూర్తి చేసి ఒక భాగం వదిలేశారు. రైల్వే స్టేషన్ ప్రధాన ముఖద్వారం నుంచి దక్షిణం వైపున ఉన్న స్థలంలో ప్లాట్‌ఫారం లేక వర్షాకాలం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పైగా రైల్వేశాఖకు సంబంధించిన కార్యాలయాలన్నీ దక్షిణం వైపునే ఉండడంతో స్టేషన్‌లో నుంచి కార్యాలయాల్లోకి రావడానికి ఇబ్బందులు పడేవారు. దీంతో దక్షిణం వైపున కూడా ప్లాట్‌ఫారం వేసేందుకు రైల్వే అధికారులు నిధులు మంజూరు చేయడంతో వాటికి పనులు చేపట్టారు. అయితే దక్షిణం వైపున ఉన్న ప్రాంతం లోతట్టుగా ఉండటంతో అక్కడ ముందు మంచి గ్రావెల్ లేదా క్వారీ డస్ట్‌తో ఎత్తు చేసి దానికి క్యూరింగ్ చేసి పటిష్టం చేసిన తర్వాత దానిపైన సిమెంట్ కాంక్రీట్ చేయాల్సి ఉంది. వాస్తవంగా లూజ్ మట్టి ఉన్నా దానిని తొలగించి మంచి మట్టి తోలి పనులు చేస్తారు. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్‌ఫారం వేయడానికి లోతట్టు ప్రాంతంలో ఎక్కడ నుంచో పనికి రాని చెత్తా చెదారంతో కూడిన వేస్టేజీ మట్టిని తోలారు. దానిని నీటితో తడిపి రోలింగ్ చేయకుండానే దానిపై 40 ఎంఎం కంకరతో తొలివిడత కాంక్రీట్ వేశారు. ఈ కాంక్రీట్ కూడా క్యూరింగ్ చేయకుండానే 20 ఎంఎం కంకరతో ఫైనల్ కాంకీంట్ వేసేందుకు సిద్ధం చేశారు. నాణ్యత లేకుండా వేస్తున్న ఈ ప్లాట్‌ఫారంకు ఎలా ఎన్నిక వస్తుందని ప్రయాణికుల, రైల్వే ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ఫైనల్ కాంక్రీట్ అయినా నాణ్యతగా వేసి క్యూరింగ్ చేసేట్లు చూడాల్సి ఉంది.



వేస్టేజీ మట్టిపైనే ఫ్లాట్‌ఫారం కోసం 40 ఎంఎం కంకరతో వేసిన కాంక్రీట్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏఎస్ పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులలో భాగంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఏఎస్ పేట గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఎఈ నిరంజన్ శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ విషయం గ్రామ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9498
వెండి కిలో ధర	రూ. 117300
వెండి ఒక గ్రాము	రూ. 120.30

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



సంతానలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాలలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం, యర్రబల్లిగడ్డ, అప్పసముద్రం గ్రామాల్లో గంగమ్మ, అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మీ ఆలయాలతోపాటు ఉదయగిరి పట్టణం లోని సంతానలక్ష్మి, పార్వతీ పరమేశ్వర ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సంతానలక్ష్మి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు, యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఏ నరసింహులు, సీహెచ్‌సీ వైద్యులు ఠాగూర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కేసీ విక్రమ్, సిబ్బంది షఫీ, సుధీర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

● 10 మందికి గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేట గ్రామంలో గురువారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలోని పది మందిని కరిచి తీవ్రంగా గాయపర్చింది. గ్రామస్థులు వెంటాడి కుక్కను చంపేశారు. గాయపడిన వారంతా ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురు, శుక్రవారాల్లో వ్యాక్సిన్ వేయించుకున్నారు. గ్రామంలో సుమారు 150 వీధికుక్కలు ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఎంఈవోకు సన్మానం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండల విద్యాశాఖాధికారి-1గా బాధ్యతలు చేపట్టిన జీ.కొండయ్యను శుక్రవారం ఏపీటీఎఫ్ మండల కమిటీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై వారు ఎంఈవోతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మాల్యాద్రి, బాలకృష్ణ, జిలాని బాషా, నరసరాజు, శ్రీనివాసులు, మాల్యాద్రి, సుబ్బారావు, గౌస్‌బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

● కానిస్టేబుల్‌కు...

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్‌గా ఎంపికైన మనోజ్‌ను శుక్రవారం సీఐ వేమారెడ్డి సన్మానించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నిరుపయోగంగా ఉన్న శ్రెడ్డర్ యంత్రం వినియోగించండి



ప్లాస్టిక్ శ్రెడ్డర్‌ను పరిశీలిస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ వంశీ

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెత్త సంపద కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ శ్రెడ్డర్ యంత్రాన్ని వినియోగించాలని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ వంశీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఈవోఆర్డీ వరప్రసాద్‌తో కలిసి సంగం - కలిగిరి రహదారిలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీచేశారు. అక్కడ నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ శ్రెడ్డర్ యంత్రాన్ని వెంటనే వినియోగంలోకి తెచ్చి చెత్త నుంచి సంపద సృష్టించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరసయ్య, సిబ్బంది ఉన్నారు.

ఉత్సవాలకు గణనాథులు సిద్ధం



అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమయ్యారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి పండుగ కావడంతో ప్రధాన నగరాలు, పట్టణాల్లో విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఒక అడుగు నుంచి సుమారు 15 అడుగుల ఎత్తు వరకు వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు. ఎక్కువ భాగం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన రంగుల విగ్రహాలే దర్శనమిస్తుండడం గమనార్హం. భక్తులు ఆకర్షించే విధంగా సిద్ధి వినాయకుడు, శివపార్వతీ సమేత వినాయకుడు, నటరాజ గణేశుడు, అర్ధనారీశ్వర గణేశుడు, కృష్ణావతార గణేశులు, మూషిక, నెమలి, సింహ, వృషభ వంటి వివిధ వాహనాలపై కొలువైన బొజ్జగణపయ్యలను తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

మట్టి విగ్రహాలను పూజిద్దామని, దీనివల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కె శ్రీనివాసులురెడ్డి అన్నారు. నీరు కాలుష్యం కాకుండా ఉండాలంటే రసాయనాలతో తయారైన విగ్రహాలను కాకుండా మట్టి విగ్రహాలను పూజించి సాంప్రదాయాన్ని కాపాడుకుందామన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఐ వేమారెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మున్సిపాల్టీ, అన్ని మండలాల్లో ఈనెల 27వ తేదీన జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆత్మకూరు ఇన్‌చార్జ్ సీఐ వేమారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాల అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఎస్ఐ పరిశీలించిన అనంతరం అనుమతి జారీచేయడం జరుగుతుందన్నారు. విగ్రహం ఏర్పాటుకు కమిటీగా ఏర్పడి బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందన్నారు. వినాయక చవితికి మైక్ అనుమతులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు, ఊరేగింపుల తేదీల వివరాలను తప్పకుండా తెలియజేయాలన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి ఘర్షణలకు దారితీసినా సంబంధిత నిర్వాహకులపై చర్యలు తప్పవని, కావున గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక అధికారిని సమన్వయకర్తగా నియమిస్తామన్నారు. నిర్వాహకులకు ఏదైనా సమస్య లేదా సందేహాలు వచ్చినా సమన్వయ అధికారిని లేదా ఆయా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జనానికి వినియోగించే వాహనాల వివరాలు తెలియజేయాల్సి ఉందన్నారు. భద్రత కోసం రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకుల ప్రతినిధులు కాపాలా ఉండాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లయితే అర్జీదారుడు లేదా కార్యనిర్వాహకులు బాధ్యత నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐ షేక్ జిలాని పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాకర్ల



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

వింజమూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యర్రబల్లిపాలెం చెరువు నుంచి జాతీయ రహదారికి టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్న ప్రాంతాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇరిగేషన్ ఈఈతో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సుమారు 145 చెరువుల అభివృద్ధికి కృషిచేస్తానని, చెరువులన్నింటికీ అధ్యక్షులను నియమించడం జరిగిందని, వారి పర్యవేక్షణలో చెరువుల అభివృద్ధి జరుగుతుందన్నారు. చెరువుల్లో నియంత్రణ లేకుండా గోతులు తీస్తున్నారని ఇకపై అలా జరగకుండా క్రమపద్ధతిగా మట్టినితీసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, అధికారుల పర్యవేక్షణలో మట్టిని తరలించే విధంగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా వింజమూరు నుంచి నందిగుంటకు వెళ్లే రహదారి పక్కన ఎడమ చేతి వైపు ఉన్న ప్రభుత్వ భూమిలో నుడా లే అవుట్ ఏర్పాటుచేసి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చి, తద్వారా వింజమూరు అభివృద్ధికి కృషి చేయాలని ప్రణాళిక చేశామని, ఆ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులుయాదవ్, కె శ్రీనివాసులు నాయుడు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన టీడీపీ నాయకులు



మంత్రి ఆనంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నాయకులు శుక్రవారం దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అమరావతిలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంగం పీఏసీఎస్ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్‌ను ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమించారు. అంతేకాకుండా పెరమన నాయకుడు పిట్టు పట్టాభిరామిరెడ్డి సంగం పీఏసీఎస్ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో వారు అమరావతి వెళ్లి మంత్రి ఆనంను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, స్థానిక రైస్ మిల్లు యజమాని గద్దె పెంచలనాయుడు ఉన్నారు.

దుర్వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి : ఎస్ఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రగతి కళాశాలలో నషా ముక్తా భార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన

ఏఎస్ పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సంగం సిఐ వేమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఏఎస్ పేట ఎస్ఐ సైదులుతో కలిసి శ్రీకొలను గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు బాలల చట్టాలు గురించి వివరించారు.

సబ్సిడీపై కిసాన్ డ్రోన్ పంపిణీ

ఏఎస్ పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం సబ్సిడీపై కిసాన్ డ్రోన్‌ను వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనుమసముద్రం గ్రామంలోని జ్యోతి రైతు సేవా సంఘం రూ. 2లక్షలు, ప్రభుత్వ రాయితీ రూ. 7.8లక్షలు కెనరా బ్యాంక్ సహకారంతో డ్రోన్ కంపెనీకి అందించడంతో వారు డ్రోన్‌ను అందించారు. దానిని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, డ్రోన్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ యోగేశ్వర్, వ్యవసాయ సహాయకులు లావణ్యలు రైతు సంఘ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ ఎక్సటెన్షన్ అధికారులు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వారానికి రెండుసార్లు చెత్త సేకరించాలి : ఎంపీడీవో



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అనంతసాగరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి వారానికి రెండు సార్లు తడి, పొడి చెత్త సేకరించాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ సిబ్బందికి సూచించారు. కొత్తపల్లిలో శుక్రవారం జరిగిన పారిశుద్ధ్య పనులను పరిశీలించి గ్రీన్‌అంబాసిడర్లకు సూచనలు చేశారు. వారానికి రెండు సార్లు సేకరించిన వ్యర్థాలను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు కోసం విద్యార్థుల ఆందోళన



జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సీతారామపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం నుంచి డీజీ పేట మార్గంలో అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం పలువురు విద్యార్థులు పబ్బులేటిపల్లి గ్రామ సమీపాన గల జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయాన్నే ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు కేవలం ఒక ట్రిప్పు మాత్రమే డిజి పేట వరకు వెళ్లి తిరిగివస్తుందని, ఈమార్గంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు, ఇతరత్రా పనుల కోసం సీతారామపురం మండల కేంద్రానికి అనేకమంది ఇదే బస్సులో ప్రయాణిస్తుండంతో బస్సులో కూర్చునేందుకు సీట్లు సరిపోకపోవడంతో నిలబడి, డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోయారు. ఈవిషయమై గతంలో ప్రయాణికులు నిరసన వ్యక్తం చేయడంతో కొద్దిరోజుల పాటు ఆర్టీసీ బస్సు ఉదయం పూట రెండు ట్రిప్పులు తిరిగేదని, ప్రస్తుతం ఒక ట్రిప్పుకే పరిమితం చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతూ, భయం భయంగా బస్సులో ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉదయగిరి డిపో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి డీజీపేట మార్గంలో అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ప్రధానమంత్రి జన సురక్ష పథకాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీఆర్ కల్యాణ మండపంలో కెనరా బ్యాంకు ఖాతాదారులకు శుక్రవారం బ్యాంకు అధికారులు ప్రధానమంత్రి జన సురక్ష పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి పసల బీమా యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆధార్ ఈకేవైసీ, సైబర్ దాడులు, నేరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు జీఎం డీఎస్ఆర్ శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మణి శేఖర్, డివిజనల్ మేనేజర్ సురేష్‌స్వామి, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఖాతాదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈవోలు తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులతో కలిసి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థిమిత్ర కిట్లకు సంబంధించి అథెంటిఫికేషన్ పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి: సీఐ

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ వేమారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక జాతీయ ముంబాయి రహదారిపై చెక్ పోస్టు వద్ద వాహనదారులను నిలిపి రోడ్డు నిబంధనలు తెలియచేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రాజేష్, పోలీసులు ఉన్నారు.

నిమజ్జన ప్రాంతం పరిశీలన

స్థానిక పెన్నా నదిలో వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని స్థానిక ఎస్ఐ రాజేష్, పంచాయతీ కార్యదర్శి నరసయ్యతో కలిసి సీఐ వేమారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి పండుగ అనంతరం విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా నిమజ్జన ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు ఏర్పాట్ల నిమిత్తం పరిశీలించారు. ఎస్ఐ రాజేష్, పంచాయతీ కార్యదర్శి నరసయ్యతో బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు.

C.R.I.M.E N.E.W.S

22.5 కేజీల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్ ● నిందితులు చెన్నై నగరవాసులు



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ శుక్రవారం తన కార్యాలయంలో నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. రైల్వే సీఐ సుధాకర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. చెన్నై నగరానికి చెందిన పళని రాజేష్, జుబునీషా అనే ఇద్దరు ఒడిశా రాష్ట్రం రాయఘడ్ నుంచి రైలులో వచ్చి నెల్లూరు స్టేషన్‌లో దిగారు. ఇక్కడి నుంచి చెన్నై వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వారి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా రాజేష్ వద్ద 14.5 కేజీలు, జుబునీషా వద్ద 8 కేజీలు కలిపి మొత్తం రూ.4.50 లక్షల విలువ చేసే 22.5 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నెల్లూరు రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నామని చెప్పారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని పట్టుకున్న సీఐ, ఎస్ఐ హరిచందన, ఆర్పీఎఫ్ ఎస్ఐ శివరూపవత్, సిబ్బంది జయప్రకాష్, మణికంఠ, కిరణ్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో నెల్లూరు రైల్వే సీఐ ఏ సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీ రమేష్‌గౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రాసిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడు అల్లూరు వాసి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రాసిన నిందితుడిని దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జిల్లాలోని అల్లూరు మండలం పడమటి గోగులపల్లికి చెందిన వాలిమేటి నాగమణికుమార్ అల్లూరులో నివాసం ఉంటున్నారు. ఆయన ఆరు నెలల కిందట నగరంలోని హరనాథపురంలో ఉన్న బావమరిది ఇంటికి వచ్చారు. బావమరిది పిండిమిల్లులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ఈజీగా డబ్బు సంపాదించడం ఎలా అని మణికుమార్ సామాజిక మాధ్యమాల్లో శోధిస్తూ ఉండేవారు. ఈక్రమంలో నక్సల్స్ బెదిరింపు లేఖలు ఎలా రాస్తారు అన్న అంశంపైనా సెర్చ్ చేశారు. ఆ వీడియోలు చూసి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి లేఖ రాశారు. రూ.2కోట్లు నగదు ఇవ్వకపోతే చంపేస్తానని లేఖ రాసి ఈ నెల 18వ తేదీ వేమిరెడ్డి ఇంటి సెక్యూరిటీకి ఇచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆ లేఖను పరిశీలించి ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యేకు సమాచారం అందజేశారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్గామిట్ట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేశారు. సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితుడు అల్లూరు ప్రాంతానికి చెందిన నాగమణి కుమార్‌గా గుర్తించి అరెస్ట్ చేశామని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య తెలిపారు.

బంగారు, వజ్రాల నగలు, నగదు చోరీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి లోపలికి ప్రవేశించి బంగారు నగలు, నగదు, వజ్రాల హారాన్ని గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ చోరీ శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరులోని లేక్‌వ్యూ కాలనీలో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు.... వెదురు బొంగుల వ్యాపారం చేసే వెంకటేశ్వర్లు కుటుంబం లేక్‌వ్యూ కాలనీలో నివసిస్తోంది. ఆయన భార్య కొద్ది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఈనెల 21వ తేదీ వెంకటేశ్వర్లు వ్యాపార నిమిత్తం ఆత్మకూరుకు వెళ్లారు. రాత్రి ఇంటికి రాలేదు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున ఆ ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులోని సుమారు ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్, కొంత నగదు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన వెంకటేశ్వర్లు తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులను దోచుకెళ్లారని గుర్తించారు. వెంటనే దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని చెన్నై వాసి మృతి



కమలనాథన్ మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని చెన్నైకి చెందిన 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి శుక్రవారం కావలి పట్టణం మద్దూరు పాడు సమీపంలోని కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఫిట్స్ వచ్చి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ తిరులరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న సంచిలో లభించిన చిన్న కీపేడ్ ఫోన్‌లోని నెంబర్ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు తెలిపిన వివరాల మేరకు మృతుడు చెన్నైకు చెందిన కమలనాథన్‌గా గుర్తించారు. అతను మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

ఆస్తి వివాదంలో తండ్రీకొడుకులపై దాడి

కొండాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంలో తండ్రీకొడుకులపై బంధువులు దాడి చేసిన ఘటన శుక్రవారం మండలంలోని గరిమెనపెంట పంచాయతీ వెంకటరంగాపురంలో జరిగింది. బాధితుడు డేగ రాము తెలిపిన వివరాల మేరకు.. రాము, అతని తమ్ముడు డేగ మల్లికార్జున మధ్య ఆస్తి విషయంలో వివాదం ఉంది. ఈ క్రమంలో పొలంలోకి వస్తే ఈ సమస్యను పరిష్కరించుకుందామని అన్నను తమ్ముడు మల్లికార్జున పిలిచాడు. దీంతో రాము, అతని కుమారుడు మణి పొలంలోకి వెళ్లారు. వారిపై రాము తమ్ముడు మల్లికార్జునతోపాటు బంధువులు పసుపులేటి రాహుల్, డేగ మహేష్, సుశీల, వసంత, పీ.శ్రీనివాసులు, ఇందు, పసుపులేటి లక్ష్మి తదితరులు మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల రైతులు అక్కడికి చేరుకుని దాడిని అడ్డుకున్నారు. ఈ దాడిలో రాము, అతని కుమారుడు మణికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అక్కడి నుంచి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. గాయపడిన వారిని ముందు కావలి ఏరియా వైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని పోలీసులు సూచించారని, అక్కడ నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని చెప్పడంతో వారిని ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	103
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100) : 525

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం కందుకూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పడమర బలిజపాలెంలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చి కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో శిగా శ్రీను, ఏకాంబరం విశ్వనాథం, శెట్టి కొండయ్య, గోకరాజు మాధవరావు, శ్రీను, మేకల నరసింగరావు, శ్రీరామ్, సాకిరి సాయిచందు తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి వీరాభిమాని బొమ్మల చిరంజీవి ఆధ్వర్యంలో పట్టణంలోని జనార్దనస్వామి కల్యాణ మండ పంలో ఫినిక్స్ ఈవెంట్స్‌తో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

అల్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఈనెల 27 నుంచి నిర్వహించే వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమలు ఏర్పాటు చేయాలంటే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావలి సీఐ పాపారావు ఆదేశాల మేరకు ప్రజలకు వినాయక చవితి ఏర్పాట్లపై కొన్ని నిబంధనలు పెట్టామని పేర్కొన్నారు. మండపాల కోసం పోలీసు, పంచాయతీ, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని రాత్రి 10 గంటల తరువాత మైక్ వినియోగించరాదని, ట్రాఫిక్ అంతరాయం, మద్యం సేవించి కార్యక్రమాల్లో పాల్గొనడం, నినాదాలు వంటివి చేయరాదని, మండలపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, నిమజ్జనానికి పోలీసులు ఇచ్చిన మార్గాలను అనుసరించాలని పేర్కొన్నారు. మట్టి విగ్రహాలు వినియోగించాలని, మతసామరస్యాన్ని పాటించాలని, అదేవిధంగా తమ శాఖ సూచించే నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ఈ నిబంధనలు పాటించకుంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

ఉలవపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని, వారి జీవితాలను సంక్షోభంలోకి నెట్టొదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది దివ్యాంగులకు అనర్హత వేటు వేసి పింఛను తొలగించారని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులకు వెంటనే పింఛను పునరుద్ధరించాలని, లేని పక్షంలో వారి ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని పేర్కొన్నారు.

పోలీసు శాఖకు కంప్యూటర్ బహూకరణ

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్లు బీ.నరేంద్రబాబు శుక్రవారం పోలీసుశాఖకు కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ కంప్యూటర్‌ను రూరల్ ఎస్‌ఐ మహేంద్రనాయక్‌కు అందజేశారు. నెల్లూరులోని పోలీసుశిక్షణ కళాశాల (డీటీసీ)లో కానిస్టేబుళ్లకు నేరపరిశోధనలో అధునాతన టెక్నాలజీ వినియోగం, ఏఐ ఆధారిత నేరపరిశోధనపై నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం కోసం ఈ కంప్యూటర్‌ను అందజేస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు తెలిపారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ను విజయవంతం చేయాలి

కలిగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మండలంలోని 23 పంచాయతీలలో శనివారం ప్రభుత్వం నిర్ధేశించిన కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్థుల సహకారంతో తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కాలువలను శుభ్రం చేయడం, అంటువ్యాధుల నివారణ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు నిర్వహించడం తదితర కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

ఎవరి స్థలం ఎక్కడుందో ?


వలేటివారిపాలెం జగనన్న కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు

మండల కేంద్రమైన వలేటివారిపాలెం గ్రామంలో 186 కుటుంబాలకు ఊరికి దూరంగా పొలాల్లో ఇళ్ల పట్టాలను గత వైసీపీ ప్రభుత్వంలో అందజేశారు. పట్టాలైతే ఇచ్చారు ఇంటి నిర్మాణాల పనులు మాత్రం చేపట్టలేదు. నలుగురు లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలకు పిల్లర్లు వేశారు. వీరికి బిల్లులు మంజూరు చయలేదు. తమ సెంటున్నర స్థలం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని లబ్దిదారులు వాపోతున్నారు. ఎప్పుడో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇప్పుడు పిచ్చి మొక్కలు మొలిచాయి. మట్టి రోడ్లతో పాటు లే అవుట్‌ల అబివృద్ధికి గతంలో లక్షల రూపాయల ఉపాధి నిధులు వెచ్చించారు. అవన్నీ వృథా అయ్యాయి. మళ్లీ లేఅవుట్‌లు అబివృద్ధి పనులు చేయాలంటే ప్రజాధనం రూ. లక్షల్లో వెచ్చించాల్సిన పరిస్థితి. ఇలా మండలంలో అనేక గ్రామాల్లో జగనన్న లేఅవుట్‌ల దుస్థితి ఇది.

\- వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి)

అసంపూర్తిగా వాటర్ ట్యాంక్ నిర్మాణం



మండలకేంద్రమైన వలేటివారిపాలెం బీసీ హాస్టల్ ముందు పీహెచ్‌సీ భవనం వెనుకవైపున పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీలకు రాళ్లపాడు రోళ్లపాడు రక్షిత తాగునీరు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావ్యవస్థకు చేరడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశారు. దాని స్థానంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.30 లక్షల నిధులతో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారభించారు. అయితే నిధులు మంజూరు కాక వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. దీంతో ఎస్సీ బీసీ, ఎస్టీ కాలనీలకు రక్షిత తాగునీరు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారలు స్పందించి అసంపూర్తిగా నిలిచిన వాటర్‌ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

\- వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి)



విద్యార్థుల క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలే లక్ష్యం

● కనుపర్తి మాల్యాద్రి, ఎంఈవో-1, లింగసముద్రం

లింగసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దడంతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని 38 ప్రాథమిక, 2 యూపీ, 4 ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీ, 1 ఏపీ మోడల్ స్కూల్, 1, ఏపీ గురుకుల పాఠశాల ఉన్నా యి. వీటిలో 1 నుంచి 10వ తరగతి వరకు 3,377 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ మండలంలో విద్యా వ్యవస్థ పనితీరు బాగుందని, ఇంకా ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దేందుకు కృషి చేస్తామని ఎంఈవో-1 కనుపర్తి మాల్యాద్రి తెలిపారు.

? మండలంలో విద్యా వ్యవస్థ పనితీరు ఎలా ఉంది.

! విద్యా వ్యవస్థ పనితీరు బాగుంది. ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దేందుకు కృషి చేస్తా.

? ఉపాధ్యాయుల కొరత ఉందా.

! మండలంలో 107 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఒక్క మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో ఒక గణితం ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది.

? ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా.

! ఉపాధ్యాయులు సమయపాలన కచ్చితంగా పాటిస్తున్నారు. ఒక నెలలో 3 సార్లు లేట్‌గా హాజరైతే ఒక సీఎల్ పడుతుంది.

? సీఆర్‌పీల పనితీరు ఎలా ఉంది.

! మండలంలో నలుగురు సీఆర్‌పీలు ఉండగా ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన ముగ్గురు బాగానే పని చేస్తున్నారు.

? మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమతవుతుందా.

! అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారు. ఎక్కడైనా మెనూ ప్రకారం భోజనం అందించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం.

తీరప్రాంత భద్రతపై సహకరించండి

● మత్స్యకారులకు అవగాహన

ఉలవపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతం భద్రతా విషయంలో మత్స్యకారులు సహకారం చెప్పుకోదగ్గ అంశమని రామాయాపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ జీ శివన్నారాయణ అన్నారు. మండలంలోని పెద్దపట్టపుపాలెంలో శుక్రవారం సామాజిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో మత్స్యకార గ్రామాల సహకారంతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా మెరైన్ పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. సముద్ర మార్గానా దేశంలోకి ఉగ్రవాదులు, చొరబాటుదారులు, మాదక ద్రవ్యాల వంటి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా నివారించడానికి మత్స్యకారులు సహకారం అందించాలని సూచించారు. అంతేకాకుండా వేటకు వెళ్లేటప్పుడు లైఫ్ జాకెట్స్ లైఫ్‌బాయ్స్‌ని కచ్చితంగా తీసుకెళ్లాలన్నారు. వేట సమయంలో కొత్త బోట్లు, వ్యక్తులు కనిపించినా, ఆపద ఎదురైనా వెంటనే కోస్టల్ సెక్యూరిటీ టోల్ ఫ్రీ నెంబర్ 1093కి, కోస్ట్‌గార్డ్ టోల్ ఫ్రీ నెంబరు 1554కి, రామాయపట్నం మెరైన్ స్టేషన్‌కు సమాచారం తెలియచేయాలన్నారు. బోట్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, బోటు పైభాగం పసుపు రంగు, కింద భాగం నీలిరంగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్‌ఐ ఈశ్వరయ్య, స్థానిక సర్పంచు జయరాం, ఫారెస్ట్ సెక్షన్ అధికారి బ్రహ్మనాయుడు, సచివాలయం సిబ్బంది కల్యాణరావు, మహేశ్వరరావు, రాజేష్, వంశీయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఉలవపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురష్కరించుకొని ఉలవపాడులో వెలసి యున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుధీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ వ్రతపూజలో పాల్గొన్న మహిళా భక్తులకు పూజా సామగ్రి అందచేశారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల రంగనాథాచార్యులు, చంద్రమౌళిశర్మలు వేద మంత్రాలతో లక్ష్మీదేవిరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకే తీర్థప్రసాదాలు అందచేశారు.


వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

స్మార్ట్‌బ్రెయిన్ టెక్నాలజీస్‌కు విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్, స్మార్ట్‌బ్రెయిన్ టెక్నాలజీస్ సంస్థ హెచ్‌ఆర్‌లు

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌బ్రెయిన్ టెక్నాలజీస్ సంస్థ శుక్రవారం స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 17మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంది. సంస్థ హెఆర్ ప్రతినిధులు జీడీ, ఇంటర్వ్యూ పద్ధతిలో ఈ ఎంపికలు నిర్వహించారు. కాలేజీ కరస్పాండెంట్ కే.విజయ్‌శ్రీనివాస్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వడ్డి విక్రంరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రవి కుమార్, సహిత్య, సుమలత, భరద్వాజ్, మీరావలి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళమెత్తాలి

● మున్సిపల్ కార్మికుల 4వ మహాసభ


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య

కావలి(టౌన్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు గళమెత్తాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక షాదీమంజిల్‌లో యూనియన్ 4వ మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెంచలనరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్మికుల తలరాత మారడంలేదన్నారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకపోగా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని చూడడం దుర్మార్గమన్నారు. ఇటీవల నెల్లూరులో కార్మికులను ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పెద్దఎత్తున పోరాటం చేసి విజయం సాధించారన్నారు. అదే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలు కొనసాగించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కే రెహనాబేగం మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ఇతర రంగాల కార్మికులు కూడా సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నప్పటికీ పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తురకా శీనయ్య, రాజ్యలక్ష్మి, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, ఎస్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎంపీపీ


సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్

లింగసముద్రం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణయ్య మాట్లాడు తూ మంచినీటి పథకాల ద్వారా తాగునీరు కలుషితమై వస్తోందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. తిమ్మారెడ్డిపాలెం గ్రేజింగ్ భూములను బయటి గ్రామాల వ్యక్తులు ఆక్రమించి జామాయిల్ సాగు చేస్తున్నారని ఎంపీటీసీ వెంకటేశ్వర్లు చెప్పారు. లింగసముద్రం పాత చెరువు కట్ట, తూములు, కాలువల మరమ్మతులకు గురయ్యాయని, వాటి బాగు చేయించాలని కోరారు. అయితే ఈ సమాశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు బదులుగా వారి బంధువులు హాజరై అధికారులను సమస్యలపై ప్రశ్నించారు. దీనివో ఎంపీడీవో శ్రీనివాసులు వారిని వారించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఆర్‌ఐ రమణయ్య, నీటి పారుదల శాఖ ఏఈ మనోహర్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ప్రతిమల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

● డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినం సందర్భంగా నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలకు అనుగుణంగా అన్నిరకాల జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సాయంత్రం ఆయన సబ్‌డివిజన్ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ విగ్రహాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత విగ్రహ కమిటీలదేనని తెలిపారు. విగ్రహాలవద్ద పెద్దపెద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు, రాజకీయ ప్రేరేపిత స్లోగన్లు నిషిద్ధమని, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతితో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు చేయకూడదన్నారు. ఏవైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినా రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విగ్రహకమిటీల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయటం ద్వారా ఎలాంటి రుసుము లేకుండా విగ్రహాలకు అనుమతులు పొందవచ్చునని తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో కూడా ఈ నిబంధనలన్నీ వర్తిస్తాయని, శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో భక్తితో నిమజ్జనోత్సవాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు అన్వర్‌బాషా, మంగా రావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే కుట్ర

● నల్లబ్యాడ్జీలతో చౌదరిపాలెం వాసుల నిరసన

కావలిరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ఆయనను హతమార్చేందుకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుట్రపన్నడం దారుణమని చౌదరిపాలెం టీడీపీ నాయకుడు గోరంట్ల రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చౌదరిపాలెంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కావలి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అశాంతి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండవ శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, పోకూరు రాంబాబు, మండువ సుబ్బారావు, శేషమ్మ, యామన హారిక, గొంది అంజమ్మ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్థులు

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 'జనసురక్ష'


జన సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ అధికారులు

కావలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విశ్వోదయ బాలికల ఉన్నతపాఠశాల ప్రాంగణంలో జనసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ తిరుపతి డిప్యూటీ జనరల్ మేనేజరు దినేష్ గులాటి, నెల్లూరు రీజనల్ మేనేజరు మురళీనాయక్, నెల్లూరు మేనేజరు మల్లికార్జున్, కావలి బ్రాంచి మేనేజరు రమేష్ పాల్గొని జనసురక్ష పథకం ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకాలు కలిగి ఉంటే ఏదైనా ప్రమాదాలు జరిగినపుడు ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు అందజేస్తారన్నారు. అలాగే జనధన్ ఖాతాలు తెరచి 10 ఏళ్లు పూర్తైన వారు ఈకేవైసీ చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు లోక్‌నాథం, మెప్మా సీఎం భారతి, వెలుగు ఏపీఎం కృష్ణారావు, పెన్షనర్స్ అసోసియే షన్ సెక్రటరీ కే.హరినారపరెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీమాధవి పాల్గొన్నారు.

68వ సారి 'కండ్లగుంట' రక్తదానం

కావలి(టౌన్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు శుక్రవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో 68వ సారి రక్తదానం చేశారు. ఆయనను రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ రవిప్రకాష్, రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ రమ్య, పాలకమండలి సభ్యులు హరినారపరెడ్డి, ప్రణీత్ తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. మధుబాబునాయుడు విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి రక్తదానం పట్ల చైతన్యం కలిగి ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తూ కావలి రెడ్‌క్రాస్ కేంద్రంలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన రక్తదాతగా గుర్తింపు పొందారన్నారు. ఆయన యువతకు మర్గదర్శకుడిగా, బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని అభినందించారు. మధుబాబునాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడం సేవగా కాకుండా బాధ్యతగా భావించాలని, మన రక్తదానం మరొకరి ప్రాణం కాపాడిందంటే ప్రాణం పోసినట్లేనన్నారు. యువత సామాజిక స్పృహ కలిగి బాధ్యతగా మెలిగినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమన్నారు. అనంతరం ముధుబాబునాయుడు తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకుంటున్న చిన్నారులను పరామర్శించారు.



కండ్లగుంటను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, హరినారపరెడ్డి

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యూనెక్స్-సన్‌రైజ్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని నారాయణ విద్యా సంస్థల జీఎం, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో సమానంగా క్రీడల్లో కూడా రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర సబ్ జూనియర్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 238 మంది క్రీడాకారులు హాజరయ్యారని, మూడు రోజులు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలి

● కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

జలదంకి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకర కృష్ణారెడ్డిని హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని 9వ మైలులో పార్టీ శ్రేణులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రోడ్డుపై బైఠాయించారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను మహిళలు చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణక్రాక పంచాయతీ టీడీపీ నాయకులు చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, దగుమాటి శ్రీనివాసులరెడ్డి, వేలమూరి రామ్మోహన్‌రెడ్డి, సొంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.


ప్రతాప్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నిరసనకారులు

భూమనా.. ఆ రహస్యం చెప్పవా



మీరు వ్యాపారాలు చేయలేదు. ఉద్యోగాలూ లేవు. మరి రూ.వందల కోట్లు ఎలా వచ్చాయో.. ఆ రహస్యం చెప్పవా భూమనా. అల్లాగైతే మేమూ పీ4 ద్వారా ఏపీని పేదరికం లేని రాష్ట్రంగా మార్చుకుంటాం. శుద్ధపూస మాటలు చెప్పే కరుణాకర రెడ్డి.. అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుంది. కాస్త ఆలస్యంగానైనా జైలుకు వెళ్లక తప్పదు. టీటీడీ ఇంజనీరింగ్ విభాగానికి రూ.300 కోట్ల బడ్జెట్ ఉంటే.. ఆయన చైర్మన్ అయిన మూడు నెలల్లోనే రూ.1233 కోట్ల పనులు ఎలా కేటాయించారు?

- బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్

ఇప్పుడు డమ్మీ అంటే కుదరదు



వైసీపీ హయాంలో రూ.3600 కోట్ల లిక్కర్ కుంభకోణం జరిగినప్పుడు నారాయణస్వామి ఎక్సైజ్ శాఖకు మంత్రి. డిప్యూటీ సీఎం కూడా. ఆయనకు తెలియకుండానే ఇదంతా జరిగిందంటే నమ్మేందుకు ప్రజలేం అమాయకులు కారు. ఇప్పుడు డమ్మీ.. డమ్మీ అంటే కుదరదు. డమ్మీకి రూ.వేల కోట్లు ఎలా వస్తాయి? ఇప్పటికే లిక్కర్ డాన్లు వరుసపెట్టి అరెస్టయ్యారు. నారాయణస్వామిని మాత్రం ఎందుకు వదిలిపెడతారు.

- జనసేన నేత కిరణ్‌రాయల్



కార్మికశాఖ జేసీ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

- పలు రికార్డులు, భూమి పత్రాలు, నగదు స్వాధీనం
- నేడూ కొనసాగనున్న సోదాలు
- ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతోనే..



బాలు నాయక్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో కర్నూలు కార్మిక శాఖ జాయింట్ కమిషనరు (జేసీ) బాలు నాయక్ ఇంట్లో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతిలోని రాఘవేంద్రనగర్‌లో ఈయన నివాసం ఉంటున్నారు. ఈ ఇంటితో పాటు కర్నూలులోని కార్యాలయం, అద్దె ఇల్లు, కుటుంబీకులు, బంధువుల ఇళ్లు, అన్నమయ్య జిల్లాలోని పౌల్ట్రీ ఫారంతో పాటు తొమ్మిది ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేశారు. తిరుపతిలోని ఇంట్లో తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. బాలునాయక్ కుమారుడు నిర్వహిస్తున్న ఆర్‌సీ సర్జికల్ షాపులోనూ తనిఖీలు చేశారు. ఇంట్లో పలు కీలక రికార్డులు, బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆయన స్వగ్రామమైన రాయచోటి సమీపంలోని బిడికి తాండా, రాయచోటి, మదనపల్లె, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు, పౌల్ట్రీ ఫారాలు, భూములకు సంబంధించి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సంబేపల్లిలో ఆయనకు పౌల్ట్రీఫారం ఉన్నట్లు గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల గురించీ ఆరా తీశారు. కర్నూలు కేంద్రంగా కార్యాలయం వున్నప్పటికీ తిరుపతిలోని ఇంటి నుంచే అన్ని కార్యకలాపాలు నిర్వహించే వారని ఆరోపణలున్నాయి. కాగా, స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్లు, కీలక రికార్డులనులోతుగా పరిశీలిస్తున్నారు. ఈ సోదాలు శనివారం కూడా కొనసాగనున్నాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ చెప్పారు.



పుత్తూరులోని నారాయణస్వామి ఇంటి ముందు సందడి



ఇంటిముందు సిట్ సిబ్బంది భద్రత

మాజీ డిప్యూటీ సీఎం ఇంటి తలుపుతట్టిన సిట్

- లిక్కర్ స్కామ్ కేసులో ఏడు గంటలపాటు విచారణ
- ఇప్పటికే జైల్లో మిథున్, చెవిరెడ్డి
- నారాయణస్వామినీ అరెస్టు చేస్తారనే ప్రచారం
- వైసీపీ వర్గాల్లో గుబులు



సిట్ విచారణానంతరం మీడియాతో మాట్లాడుతున్న నారాయణస్వామి

తిరుపతి/పుత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు చేపట్టిన సిట్ బృందం తాజాగా అప్పటి ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఇంటి తలుపు తట్టింది. ఏడు గంటల పాటు సుదీర్ఘంగా విచారించింది. విజయవాడకు వచ్చి విచారణకు హాజరు కావాలని ఇదివరకే సిట్ అధికారులు నారాయణస్వామికి నోటీసు ఇచ్చారు. వయోభారం, అనారోగ్యాల కారణంగా విజయవాడ రాలేనని చెప్పడంతో విజయవాడ నుంచే టెలి కాన్ఫరెన్సు ద్వారా విచారించారు. మళ్లీ విచారణకు హాజరు కావాలని రెండోసారి నోటీసు ఇవ్వగా, నారాయణస్వామి నుంచి స్పందన లేదు. దీంతో సిట్ బృందం శుక్రవారం ఉదయం 11 గంటలకు పుత్తూరు చేరుకుని మాజీ మంత్రి ఇంటి తలుపు తట్టింది. ఇదివరకు తిరుపతి జిల్లా ముఖ్య అధికారిగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో నలుగురు డీఎస్పీ స్థాయి అధికారులు నారాయణస్వామిని ప్రశ్నించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన మొదలుకుని, అమలు, అవకతకల వరకూ పలు అంశాలపై లోతుగా విచారించారు. మరోవైపు లిక్కర్ స్కామ్ దర్యాప్తులో ఉపకరిస్తాయన్న ఉద్దేశంతో నారాయణస్వామి ల్యాప్‌టాప్‌ను, మొబైల్ ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేశారు. దీనికోసం పంచనామాకు వీఆర్వోలను పిలిపించగా, అరెస్టు చేస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఈ కుంభకోణంలో ఇప్పటికే జిల్లాకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టయి జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. వైసీపీలో వీరిద్దరూ బలమైన నేతలు. వైసీపీ అధినేత జగన్‌కు సన్నిహితులుగా ముద్ర పడ్డారు. గత ప్రభుత్వంలో బాగా అధికారం కూడా చెలాయించారు. వారిద్దరి అరెస్టు నేపథ్యంలో అదే శాఖకు మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి ఇంటికి సిట్ అధికారులు రావడంతో ఆయన్నూ అరెస్టు చేస్తారనే వైసీపీ వర్గాలు భావించాయి. ఈ పరిణామం ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గాల్లో గుబులు పుట్టించింది.

తొంగి చూడని వైసీపీ నేతలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో.. కేసు ఏదైనా వైసీపీ నేతల అరెస్టు లేదా విచారణలను ఎదుర్కొనే క్రమంలో ఆ పార్టీ నేతలు మద్దతుగా వెళ్లడం, పోలీసు అధికారులకు అడ్డుపడిన సంఘటనలు అనేకం జరిగాయి. అయితే పుత్తూరులో శుక్రవారం సిట్ అధికారులు నారాయణస్వామిని ప్రశ్నించేందుకు వచ్చిన సందర్భంలో ఓ స్థాయి నాయకులు కూడా ఆయన ఇంటి వైపు తొంగి చూడలేదు. ఆయన నివాసమున్న పుత్తూరు పట్టణం.. నగరి నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. మాజీ మంత్రి రోజాకు, ఈయనకు ఓ విధంగా చెప్పాలంటే విభేదాలున్నాయి. దాంతో స్థానిక వైసీపీ నేతలు, శ్రేణుల నుంచి ఆయనకు ఎలాంటి మద్దతూ లభించలేదు. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలుసుకుని జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచీ పదుల సంఖ్యలో కార్యకర్తలు మాత్రమే వచ్చారు. జిల్లాలో ఒకరొకరుగా నేతలు జైలుపాలవుతుండడం, కేసుల్లో చిక్కుకుంటుండడంతో వైసీపీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం సడలుతున్న పరిస్థితి కనిపిస్తోంది.


‘చవితి’ మండపాలకు సింగిల్ విండో అనుమతులు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి మండపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము లేకుండా సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ‘మండపాలను ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు కమిటీగా ఏర్పడి ఆ వివరాలను సమీప పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలి. తర్వాత Ganeshutsav.net వెబ్‌సైట్ ఓపెన్ చేసి.. అప్లై హియర్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. దరఖాస్తుదారుడి మొబైల్ నెంబరు నమోదు చేశాక ఓటీపీ నెంబరు నమోదు చేయాలి. పేరు, అడ్రస్, కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది. విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయాలి. అప్లికేషన్ జనరేట్ అయ్యాక పోలీసు శాఖ అనుమతి కోసం వారి లాగిన్‌కు వెళుతుంది. అనుమతికి సంబంధించిన క్యూఆర్ కోడ్, నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై బుక్‌లెట్ డౌన్‌లోడ్ అవుతుంది. దాన్ని ప్రింట్ తీసుకుని మండపాల వద్ద ఉంచాలి. మండపాల వద్ద మైక్ అనుమతి కావాలనుకుంటే మీ-సేవ కేంద్రాల వద్ద పొందాలి. లౌడ్ స్పీకర్లను పెట్టకూడదు.మండపాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యత. ప్రైవేటు, పంచాయతీ స్థలాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా స్థల యజమాని అనుమతి తీసుకోవాలి’ అని ఆ ప్రకటనలో ఎస్పీ పేర్కొన్నారు.

కృష్ణాజలాల పరవళ్లు

- పుంగనూరు వద్ద పూజలు చేసి హారతిచ్చిన మంత్రి



నేతిగుట్లపల్లె పంప్ హౌస్ నుంచి దుముకుతున్న కృష్ణాజలాలు



ప్రసన్నయ్యగారిపల్లె వద్ద జలహారతి ఇచ్చి పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిరా బిరా కృష్ణమ్మ పరుగులు తీస్తూ శుక్రవారం చిత్తూరు జిల్లా సరిహద్దుల్లోకి చేరుకుంది. పుంగనూరు సమీపంలోని ప్రసన్నయ్యగారిపల్లె వద్ద టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి మంత్రి రాంప్రసాదరెడ్డి హంద్రీనీవా కాల్వలో కృష్ణా జలాలకు పూజలు చేసి హారతిచ్చారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మీదుగా కుప్పానికి కృష్ణాజలాలు తీసుకొస్తున్నారని చెప్పారు. కాగా, హంద్రీనీవా కాలువ ద్వారా పరవళ్లు తొక్కుతూ కృష్ణాజలాలు శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో పుంగనూరు మండలంలోని ఈడిగపల్లె, చిలకవారిపల్లె మీదుగా నేతిగుట్లపల్లె లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌కు చేరాయి. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్‌కుమార్ ఆదేశాలతో లిఫ్ట్ ద్వారా నాలుగుపైపులకు గానూ రెండుపైపుల్లో నీటిని విడుదల చేశారు. శుక్రవారం పుంగనూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన ఉండడంతో జలహారతి ఇప్పించారు. పుంగనూరు మండలం ప్రసన్నయ్యగారిపల్లె, మార్లపల్లె, మాదనపల్లె మీదుగా నీరు పరవళ్లు తొక్కుతూ పెద్దపంజాణి మండలంలోకి ప్రవేశించాయి.కాగా ఉదయం నుంచి హంద్రీనీవా కాల్వల ప్రాంతానికి ప్రజలు వెళ్లి కృష్ణాజలాలకు పూజలు చేశారు. తాగు,సాగు నీటి కష్టాలు తీర్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ఒకటిన పింఛన్లు అందజేస్తాం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాత్కాలిక సదరం ధృవపత్రాలు పొందిన దివ్యాంగులకు సెప్టెంబరు ఒకటో తేదీన పింఛను మొత్తం అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సదరం పునఃపరిశీలనలో అనర్హులుగా గుర్తించి నోటీసు అందుకున్న దివ్యాంగులు తాము అర్హులమని భావిస్తే సంబంధిత మండల పరిషత్ అధికారి, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో నోటీసు అందుకున్న 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన వారిగా ధృవీకరించి తాత్కాలిక సదరం ధృవపత్రం పొందిన దివ్యాంగులకు పింఛను నిలుపుదల చేస్తూ జారీ చేసిన నోటీసులను వెనక్కి తీసుకోవడానికి సచివాలయ సంక్షేమ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.






నిషిధరాజు - అశోక్‌రాజు - కోలా ఆనంద్ - ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నిషిధరాజు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో మరికొందరికి చోటు

పుత్తూరు/శ్రీకాళహస్తి/తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నిషిధరాజును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. పుత్తూరులోని బీజేపీ కార్యాలయంలో స్వీట్లు పంచారు. పుత్తూరుకు చెందిన ఈమె 14 ఏళ్లుగా బీజేపీలో వివిధ పదవుల్లో పనిచేశారు. 2019లో నగరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి మహిళలను జాగృతం చేస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తానన్నారు.

- ఇక, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పుత్తూరులోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలల యజమాని డాక్టర్ కొండూరు అశోక్‌రాజు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ కోలా ఆనంద్ నియమితులయ్యారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వీరు ప్రకటించారు. ఇక, నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

ఎస్వీయూ, మహిళా వర్సిటీలో క్రీడాకారులకు బస

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు హాజరుకానున్న క్రీడాకారులకు శ్రీవేంకటేశ్వర, పద్మావతి మహిళా యూనివర్సిటీలలో బస ఏర్పాటు చేశారు. 516 మంది చొప్పున మహిళలు, పురుషులు వస్తుండటంతో శాప్ ప్రతిష్టాత్మకంగా భావించి వసతి గృహాలను కేటాయించి, సౌకర్యాలు కల్పిస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయానికి 26 జిల్లాల నుంచి క్రీడాకారులు చేరుకుంటారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి బాలవీరాంజనేయ స్వామి, సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఎస్పీఎఫ్ డీజీ అధికారి త్రివిక్రమ్ వర్మ, డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ(ఎస్‌సీడీ) సభ్యులు, ఎంపీలు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాలొస్తున్నాయ్
రిపేర్లు పూర్తి చేయండి

● తిరుమలలో వసతిపై ఈవో సమీక్ష


తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న అన్ని వసతి గదుల్లో రిపేర్లను సకాలంలో పూర్తిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం అధికారులతో వసతి, ఇతర సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. లడ్డూప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. రాష్ట్ర ఆహార భద్రతాధికారులతో తిరుమలలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, హోటళ్లలో సంప్రదాయ భోజనం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,112
తలనీలాలు సమర్పించినవారు: 27,331



ఘల్లుమంది జానపదం



చెప్పారు. విద్యార్థుల్లో జానపదం పట్ల మక్కువ కలిగించడానికి.. వారిలో జానపద విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి చెప్పారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి



రవి కుల తిలకా రారా.. అంటూ శ్రీరాముడిని స్తుతిస్తూ సాగిన చెక్కభజన, హే బాపూ బంజారోళ్లం.. అంటూ గిరిజన సంస్కృతిని ప్రతిబింబించిన జానపదం, వస్తావా జానకి కోడిపందేమో నువ్వు.. అంటూ ప్రేమికుల మధ్య ప్రణయాన్ని తెలియజేసే జానపద నృత్యం. ఇలా.. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన జానపద కళారూపాల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడిఉన్న జానపద కళలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే తరానికి అందించాలని ఎస్వీయూ వీసీ అప్పారావు సూచించారు. రాయలసీమ, చిత్తూరు ప్రాంతానికే ప్రత్యేకమైన కొన్ని జానపద కళలు ఉన్నాయని, ఇలాంటి విలువైన కళలను కాపాడుకోవాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. జానపద విజ్ఞానంలో జానపద సంగీతం, జానపద నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని పద్మావతి వర్సిటీ సంగీత-నృత్య విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. చెక్క భజన, కోలాటం పాటల్లో మన సంస్కృతి ఉందని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ







తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు





కొండను ఢీకొన్న టెంపో - ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

స్వల్పగాయాలతో బయటపడిన భక్తులు

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. భక్తులందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నారావారిపల్లెకు చెందిన కొందరు దర్శనం తర్వాత శుక్రవారం కారులో తిరుపతికి వస్తుండగా 26వ మలుపువద్ద వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే సాయంత్రం మొదటిఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద ఓ టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి కొండను ఢీకొంది. విజయవాడకు చెందిన 10 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు.

భక్తితో భద్రతా బాధ్యతలు

● సిబ్బందితో ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్ వర్మ



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): భద్రతా వైఫల్యాలకు తావులేకుండా తిరుమలలో విధులు నిర్వహించాలని ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ్ వర్మ ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో భద్రతా జాగ్రత్తలపై తిరుపతిలోని శ్వేతభవనంలో శుక్రవారం ఎస్పీఎఫ్ సిబ్బందితో డీజీ సమావేశమయ్యారు.. టీటీడీలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతం. భక్తి, అంకిత భావంతో, విచక్షణతో, క్రమశిక్షణతో భక్తులను మెప్పించే విధంగా భద్రతా సిబ్బంది సేవలందించాలన్నారు. హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోట్ అయిన 1998 బ్యాచ్ కానిస్టేబుళ్లను అభినందించారు.

నేడు హథీరాంజీ మఠం భవనం పరిశీలన

తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం ప్రధాన కార్యాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, మఠం ఇంఛార్జి ఈవో బాపిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించనున్నారు. ఈ బృందంతో పాటు తిరుపతి ఐఐటీ నుంచీ సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు రానున్నారు. గత మంగళవారం కలెక్టరేట్‌లో మఠం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, షాపుల నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అందరితో కలసి ప్రత్యక్షంగా మఠం భవనాన్ని పరిశీలించాలని, భవనం పటిష్టతను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవాలని నాడు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికనుగుణంగా శనివారం ఉదయం 11 గంటలకు మఠం భవనం వద్దకు రానున్నారు. కాగా, శిథిలావస్థకు చేరిన ఈ పురాతన భవనాన్ని తిరుపతి ఐఐటీ నిపుణులు సైతం పరిశీలించి నివాస యోగ్యం కాదని, కూల్చివేతకు సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చారు. దీంతో కూల్చివేతకు దేవదాయశాఖ టెండర్లు కూడా పిలిచింది. ఆ దశలో ఈ వివాదం రాజకీయ మలుపు తీసుకోవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆచితూచి అడుగులేస్తున్నారు. భవనం కూల్చివేస్తే తిరిగి కొత్త భవనాన్ని నిర్మించే విషయమై దేవదాయ శాఖ నుంచీ స్పష్టత తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు భవనాన్ని కూల్చకుండా వారసత్వ కట్టడంగా కొనసాగించేందుకు అందుబాటులో వున్న అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. ఆ మేరకు పురావస్తు శాఖ, తిరుపతి ఐఐటీ, సెంట్రల్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ తదితర సంస్థలకు కూడా లేఖలు రాశారు. మొత్తానికి శనివారం ఈ భవనాన్ని పరిశీలించాక ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై నగరవాసుల్లో ఆసక్తి నెలకొంటోంది.

నీట్ పీజీలో మెరిసిన తిరుపతి కుర్రోడు సాయినితేష్

● ఆలిండియాస్థాయిలో 136వ ర్యాంకు కైవసం



తిరుపతిరూరల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నీట్ పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుచానూరు వీవీ లేఅవుట్‌కి చెందిన డాక్టర్ గండికోట సాయినితేష్ అత్యుత్తమ ప్రతిభ చాటి ఆలిండియా136వ ర్యాంకుని కైవసం చేసుకున్నాడు. ఈనెల 3న నిర్వహించిన ప్రవేశపరీక్షా ఫలితాలను ఇదే నెల 19న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో సాయినితేష్ 136వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఈ విద్యార్థి తిరుపతిలోని ఎస్వీమెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని టాప్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో జనరల్ మెడిసిన్‌ని అధ్యయనం చేస్తానని అంటున్నాడు. కాగా ఈయన స్నేహలత, శ్రీధర్ (విద్యుత్‌శాఖలో డీఈఈ) దంపతుల కుమారుడు. చెల్లెలు జాహ్నవి పద్మావతి మెడికల్ కళాశాల (స్విమ్స్)లో ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు.

వందశాతం.. అడ్మిషన్లు, ఉత్తీర్ణత

ఇదే లక్ష్యంతో పనిచేయాలంటూ సంక్షేమ హాస్టళ్ల అధికారులకు మంత్రి డోలా సూచన



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న మంత్రి, కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్

తిరుపతి(జీవకోన), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో వందశాతం ప్రవేశాలు.. ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రీజనల్ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. 'వసతి గృహాల మరమ్మతులకు రూ.143కోట్లు, నూతనంగా నిర్మించే హాస్టల్ భవనాలకు రూ.100కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.50కోట్లు విడుదల చేశాం. వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వసతి గృహ విద్యార్థులకు నవోదయ, గురుకుల పాఠశాలల్లో.. ఎంసెట్ ప్రవేశ పరీక్షలను రాసేలా అధికారులు సన్నద్ధం చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తిరుపతి కలెక్టర్ ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వారిచే తమ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకోవడం శుభపరిణామన్నారు. సంక్షేమ శాఖలోని డీడీలు, డీఎస్‌డబ్ల్యూవో, ఎస్‌డబ్ల్యూవో, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పనితీరు మార్చుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తూ, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా రాత్రి బస చేయాలని సూచించారు. వసతిగృహాల నిర్వహణ, విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై అవగాహన కల్పించడం కోసమే ఈ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి తెలిపారు. తిరుపతి జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ తరపున శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి మానసికంగా, శారీరకంగా బలోపేతం చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మొదటి దశలో 11వేల మంది విద్యార్థులు, 250మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ అవకాశాలు

నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. తిరుపతిలోని బాబు జగజీవన్‌భవననందు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణను ఆయనన ప్రారంభించారు. జర్మన్‌భాషపై నర్సింగ్ విద్యార్థులు పట్టు పెంచుకోవాలని సూచించారు. జర్మన్‌భాషపై పట్టు సాధించడానికి ఉచితంగాశిక్షణ ఇచ్చి అర్హత సాధించేలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, కలెక్టర్ వెంకటేశ్వర్, నైపుణ్యాభివృద్ధి శాఖ ఈడీ మధుసూదన్, డైరెక్టర్ లావణ్యవేణి, విక్రమ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో మాక్‌డ్రిల్

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాత్రి ప్రభుత్వం తరపున ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. డీఎస్పీలు విశ్వనాథ్, మధుసూదన రావు, ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్, వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శత్రుమూకలను ఎలా ఎదుర్కోవాలి,ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

● విద్యాశాఖ, అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌కు అనుమతి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాను విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టుల భర్తీకి గాను 21,340 మంది అభ్యర్థులు పరీక్షలకు అర్హత సాధించారు. జూన్ ఐదు నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 19,550మంది హాజరయ్యారు.

సబ్జెక్టులవారీగా ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్లు వీరే..

స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజస్ కేటగిరీలో.. : స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)లో ఎస్.సాదియా 87.24 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 31.93గా చూపారు. మొత్తం 1190 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (హిందీ)లో బురదగుంట బావాజీ 83.53 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచాడు. చివరి స్కోర్ 26.27గా చూపారు. మొత్తం 628 మందితో మెరిట్ జాబితాను ఇచ్చారు. ● స్కూల్ అసిస్టెంట్ (తమిళం)లో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. 65.07 స్కోర్‌తో జి.నందిని మొదటి స్థానంలో 42.63 స్కోర్‌తో ఎం.సెల్వరాజ్ రెండో స్థానంలో నిలిచారు. ● స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో ఎస్.విజయ్ 87.01 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా, చివరి స్కోర్ 23.63గా చూపారు. మొత్తం 1594 మందితో మెరిట్ జాబితా ఇచ్చారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)లో వి.సయ్యద్ షాహినూర్ 84.93 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 30.23గా చూపారు. మొత్తం 95 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు

స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజస్ కేటగిరీలో.. : స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్)లో కె.అబ్దుల్ రహమాన్ 84.49 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా.. చివరి స్కోర్‌గా 25.91 చూపారు. మొత్తం 1,890 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్- తమిళ మీడియం)లో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. రవిబాబు ప్రీతి 69.17 స్కోర్‌తో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. చివరిగా 33.83 స్కోర్‌తో ఎస్.ధనలక్ష్మి నిలిచారు. ● స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్-ఉర్దూ మీడియం)లో ఎం.ఎస్.సబీనా రహమతున్నీసా 65.10 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 37.53గా చూపారు. మొత్తం 16 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్)లో జి.సురేఖ 88.80 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.44గా చూపారు. మొత్తం 2238 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్-తమిళ మీడియం)లో జి.తమిళ్‌సెల్వి 66.10 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్కోర్ 29.30గా చూపారు. 33 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్- ఉర్దూ మీడియం)లో ఎస్.మహ్మమద్ జిలానీ 67 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 31.47గా చూపారు. మొత్తం 38 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో ఎం.నవీన్ కుమార్ 91 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.5గా చూపారు. మొత్తం 807 మంది మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)లో జి.రాజేష్‌కుమార్ 78.08 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 30.47గా చూపారు. మొత్తం 666 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)లో ఎం.సురేష్‌కుమార్ 86.68 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 19.26గా చూపారు. మొత్తం 4441 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్-తమిళ మీడియం)లో పీఎస్ తులసీరామన్ 67.47 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 32గా చూపారు. 33మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ●స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్-ఉర్దూ మీడియం)లో షేక్ మౌలాలీ 65.52స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు.చివరి స్కోర్ 29.77గా చూపారు. 76మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.

ఎస్జీటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్లు వీరే...

సెంకడరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)లో ఎం.ఉషారాణి 94.62 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 23.04గా చూపారు. మొత్తం 15,215 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● ఎస్జీటీ-తమిళ మీడియంలో పీఎం హేమలత 72.90 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 31.17గా చూపారు. మొత్తం 90 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ● ఎస్జీటీ- ఉర్దూ మీడియంలో షేక్ అఫ్రీన్ తాజ్ 83.03 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. చివరి స్కోర్ 27.40గా చూపారు. మొత్తం 406 మందితో మెరిట్ జాబితాను విడుదల చేశారు.

జోన్లవారీగా పీజీటీ మెరిట్ జాబితా

జోన్లవారీగా పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఇందులో పీజీటీ- ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, తెలుగుతోపాటు ఇంగ్లీష్ మీడియంకు సంబంధించి బయోసైన్స్, బోటనీ, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయాలజీ సబ్జెక్టులు ఉన్నాయి. వీటితోపాటు స్టేట్ ప్రిన్సిపాల్ పోస్టుల మెరిట్ జాబితా సైతం విడుదల చేశారు.

చెంగాళమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతం


ఉత్సవమూర్తికి పూజలు చేస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస చివరి శుక్రవారం నాడు చెంగాళమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీదేవి పూజలు జరిగాయి. ముందుగా ఉభయదాతలు పసుపు, కుంకం, గాజులు, పుష్పాలను అమ్మవారి పాదాల చెంత పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం లోని మండపంలో కొలువుదీర్చిన ఉత్సవమూర్తి వద్దకు తీసుకొచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను ప్రారంభించారు. మహిళలు సామూహికంగా వరలక్ష్మీవ్రతాలను ఆచరించారు. చిట్టేటి పెరుమాల్, భాస్కర్ ఆచారి, కర్లపూడి సురేష్, అజంతా బాబు దంపతులు ఉభకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఉభయకర్తలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయ సంఘాల ద్వారా బ్యాంకుల నుంచి తీసుకొనే రుణాలను పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ జోనల్ మేనేజర్ సీతారామ శర్మ అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్ కసిరెడ్డి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలతో సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం ఏపీఎంలు ప్రసన్న కుమారి, రాజారెడ్డి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... సీతారాముల కల్యాణం


అమ్మవారి తాళిని చూపుతున్న వేదపండితుడు

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ దక్షిణపొలం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున సీతారాముల కల్యాణం జరిగింది. పట్టాభిరామ ఆలయం కేంద్రంగా సీతారామ ధార్మికసేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో సీతారాముల శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. వేదపండితుడు, జిల్లా అర్చక సలహామండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, శివరామమ్మ, కోటేశ్వరి, వీరారాఘవరెడ్డి, లక్ష్మమ్మ, నరేష్‌శర్మ, సాయిబాబా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు


క్రీడాకారులతో భరద్వాజా సంస్థ ప్రతినిధులు

తడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విలువిద్యలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజా సేవాసంస్థ నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. తమిళనాడు రాష్ట్రం పొన్నేరిలో జరిగిన ఆర్చరీ చాంపియన్‌షిప్ అండర్-14 పోటీల్లో తడలోని పద్మావతి విద్యాలయం టైనీటాట్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. పద్మావతి విద్యాలయానికి చెందిన దీవ్యచంద్రిక, విజయ్‌మోక్షిత సాయి ప్రథమస్థానం సాధించగా, పినిశెట్టి ఆలియా నాల్గవస్థానంలో నిలిచింది. వీరికి ఆచార్య భరద్వాజా సేవాసంస్థ రూ.5,516 చొప్పున ప్రోత్సాహకాలను అందజేసింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో విభాగాధిపతులు

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాదుకు చెందిన ఐఫిల్ టెక్ సొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆ సంస్థ సీఈవో కిషోర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదటి రౌండ్‌లో రాత పరీక్షలు, రెండవ రౌండ్ ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. 62 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషోర్ తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

కోళ్లమిట్టలో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో ఉన్న భగవాన్ వెంకయ్య స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ప్రారంభించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మూడు రోజుల పాటు ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ సెంట్రింగ్ కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ సెంట్రింగ్ కార్మికుడు మునస్వామి (22) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మునస్వామి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతిగా మద్యం తాగుతుండడంతో తల్లి శ్యామలమ్మ మందలించడంతో ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మునస్వామి మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

నేడు ఇరకం దీవిలో పర్యాటకశాఖ ప్రత్యేక కార్యదర్శి పర్యటన

తడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి అనంతరాము శనివారం ఇరకందీవిలో పర్యటించనున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి రానున్న ఆయన ఇరకం, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఇరకం దీవిలో పర్యాటక రంగానికి అనువైన భూములను పరిశీలిస్తారు. అక్కడ నుంచి షార్‌కు వెళ్తారు.

మెడికల్ షాపు యజమాని ఆత్మహత్య

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌వీధిలో నివాసం ఉంటున్న కృష్ణారెడ్డి(58) ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

108లో ప్రసవం

బాలాయపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) ఓజిలి మండలంలోని లిగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి 108 వాహనంలో ప్రసవించింది. ఆమెకు గురువారం రాత్రి పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో సిబ్బంది కాన్పు చేశారు. వరలక్ష్మి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.



గోతులతో నేలపట్టు - కలుజుమిట్ట గిరిజన కాలనీ దారి - రాళ్లు తేలిన పోలిరెడ్డిపాళెం - కల్లూరు రోడ్డు

ఈ దారులు ఇంతేనా?

- అటవీశాఖ అభ్యంతరాలతో అభివృద్ధికి నోచుకోని రోడ్లు
- రాళ్లు, గోతులతో ప్రజల ఇబ్బందులు
- వర్షాకాలంలో పరిస్థితి దారుణం

దొరవారిసత్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలంలోని పోలిరెడ్డిపాళెం - కల్లూరు, నేలపట్టు కలుజుమిట్ట గిరిజన కాలనీ, నెల్లూరుపల్లి - కొత్తపల్లి గిరిజన కాలనీ రోడ్లు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ దారులన్నీ అటవీ ప్రాంతంలో ఉండడంతో బీటీ రోడ్ల నిర్మాణానికి చట్టాలు అంగీకరించవంటూ ఆశాఖ అధికారులు అభ్యంతరం చెబుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పోలిరెడ్డిపాళెం - కల్లూరు రోడ్డు 4 కిలోమీటర్ల దూరం ఉంది. జాతీయ రహదారికి లింకు రోడ్డు అయిన ఈ మార్గంలో పోలిరెడ్డిపాళెం గిరిజన కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడ నుంచి అటవీ అధికారుల అభ్యంతరాలతో తారురోడ్డు పనులు ఆపేశారు. దీంతో గ్రావెల్ రోడ్డుగానే ఉండి పోయింది. ఈ మార్గంలో సూరపు అగ్రహారం గ్రామానికి సమీపంలో శివాలయం ఉంది. ఇక్కడకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తారురోడ్డు నిర్మాణానికి ప్రయత్నించినా కార్యరూపం దాల్చలేదు. ఇక నేలపట్టు కలుజుమిట్ట గిరిజన కాలనీ రోడ్డు పరిస్థితీ ఇంతే. 1.5 కిలో మీటర్లు ఉన్న మార్గం నెల్లూరుపల్లి ఆర్అండ్‌బీ రహదారికి లింకు రోడ్డు. ఇదంతా అటవీ ప్రాంతం కావడంతో పలు పర్యాయాలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీశాఖ అధికారుల అభ్యంతరాలతో పనులు ప్రారంభంకాలేదు. ఈ మార్గంలో ఆటో వెళ్లడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అలాగే నెల్లూరుపల్లి, రామిరెడ్డికండ్రిగ మీదుగా కొత్తపల్లి గిరిజన కాలనీకి ఉన్న రోడ్డు పరిస్థితి అంతే. నెల్లూరుపల్లి దాటిన తరువాత అటవీ ప్రాంతం ఉండటంతో తారు రోడ్డు నిర్మాణం సాధ్యం కావడంలేదు. దారంతా రాళ్లుతేలి, గోతులు పడడంతో రామిరెడ్డికండ్రిగ నుంచి గిరిజన కాలనీ వరకు అధ్వానంగా ఉంది. ఈ రోడ్లను బాగు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

టిడ్కో గృహాల్లో వసతుల మెరుగుకు చర్యలు: పాశిం


టిడ్కోగృహాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల వద్ద వసతుల మెరుగుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాలను పరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పేదలకు నివాస గృహాలను అందించాలనే ఉద్దేశంతో టిడ్కో గృహాలను నిర్మించిందన్నారు. ఈ గృహాల్లో సమస్యలు ఉన్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో స్వయంగా పరిశీలించానన్నారు. ఇళ్ల పరిసరాల్లో ముళ్లచెట్లు పెరిగిపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, శివారు ప్రాంతం కావడంతో పాముల బెడద కూడా పెరిగిపోయిందని స్థానికులు తెలిపారన్నారు. దీంతో గృహాల ఆవరణను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఆరికట్ల మస్తాన్ నాయుడు, సురేంద్ర, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దయాకర్‌రెడ్డి



నాయుడుపేట/పెళ్లకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ నాయుడుపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. దయాకర్‌రెడ్డి రెండోసారి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులవడం పట్ల ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, పెళ్లకూరు మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతోటి మురళి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా మహాలక్ష్మీ హోమం


బాలాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మీ హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్ఛారణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాకచర్ల రమేష్, అయితా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో వసతుల మెరుగుకు కృషి


కాలనీవాసులతో మాట్లాడుతున్న తానంకి నానాజీ

చిల్లకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న కాలనీలో వసతుల మెరుగుకు కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. శుక్రవారం కాలనీలోని అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఎన్నికల సమయంలో కాలనీవాసులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. తన సొంత నిధులను వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణాలకు అనుకూలంగా గ్రావెల్ రోడ్లను నిర్మించడంతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీలో పూర్తి స్థాయిలో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, కొండా రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శేషాద్రి, ఆర్ఐ పూర్ణ, వీఆర్వో రమణయ్య, బెల్లంకొండ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో చెంచు మహాలక్ష్మి

పెళ్లకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల సమీపంలో నూతనంగా నిర్మించిన నరసింహ స్వామి సమేత చెంచు మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రశాంత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల్లో ఊరేగించారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జయజయరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, వెండ్లూరు, గూడలి గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఎంతో కాలంగా పరిష్కారానికి నోచుకొని పలు భూ సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అక్కడిక్కడే రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు చిరంజీవి, సుబ్రహ్మణ్యం, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్



గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ట్యాక్స్ బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గూడూరుకు చెందిన కోట సునీల్ కుమార్ ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.

కళాశాలలో సదుపాయాల పరిశీలన

గూడూరు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులను శుక్రవారం విక్రమసింహపురి యూనివర్సిటీ బృందం పరిశీలించింది. కళాశాలలో విద్యార్థులకు వసతులు మెరుగుగా ఉన్నాయని వర్సిటీకి చెందిన డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ మణికంఠ సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, శ్రీనివాసులు, షైమూన్, విజయ్‌మహేష్, సురేంద్ర, శైలజ, పీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిలికా తవ్వకాల పరిశీలన

కోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరంలో అక్రమ సిలికా తవ్వకాలను వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. సిద్ధవరం సమీపంలో ప్రభుత్వ భూముల్లో నుంచి అక్రమంగా సిలికాను తవ్వి తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సిలికా తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

మహాచండీ హోమం


హోమం చేస్తున్న అర్చకులు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీలోని విష్ణుదుర్గాదేవి ఆలయంలో 9వ వార్షికోత్సవం, శ్రావణ శుక్రవారం సందర్భంగా విష్ణుదుర్గాదేవికి మహాచండీ హోమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కలశ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ సురేష్ మహారాజ్, పీపీ ప్రకృతికుమార్, స్వామి వివేకానంద యువసైన్యం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద చిరంజీవి సేవాసంఘం అధ్యక్షుడు మాభాషా ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోటి, సూరి, ప్రభు, తేజ, దాసు, పద్మజ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

వైభవంగా కుంకుమపూజ


పోలేరమ్మ ఆలయం వద్ద కుంకుమపూజ చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో శ్రావణమాస చివరి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యంగా అంబళ్లను అందజేశారు. సాయంత్రం పోలేరమ్మను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నానాబాల సుబ్బారావు, సభ్యులు కురుగొండ ధనంజయ, కావ్య కృష్ణారెడ్డి, ఆబోతుల బాబు, హైమా, మురళి, టీడీపీ నాయకులు బిరదవాడ నారాయణ, మల్లాం రవి, బిరదవాడ శ్రీనివాసులు, గాదిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగు తుందని డీఎస్పీ గీతా కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నిషేధించడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్, కృష్ణయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి

గూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాస చివరి శుక్రవార పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని 108 కేజీల పసుపుతో అభిషేకించారు. కన్యకాపరమేశ్వరి, గంగమ్మదేవి, నారాయణమ్మ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చిల్లకూరు: తూర్పు కనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి, కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాస పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: గ్రామదేవత కోటమ్మకు ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవార పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దాతృత్వంతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.